## ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి



3లో

PCW
తెలుగు దినపత్రిక
PCW News Broadcasting PVT Ltd

## న్యూ వరంగల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'ఓ సిటీ'లో మెగా ఉచిత వైద్య శిబిరం



3లో

Published from Hyderabad, circulated to:Hyderabad, Nalgonda, Khammam, Rangareddy, Sangareddy, Warangal, Mbnr, Kurnool, Kadapa, Amaravathi,Krishna

హైదరాబాద్ సంపుటి : 03 సంచిక - 218 ఎడిటర్: నయీంపాషా పేజీలు - 08 రూ - 03/- సోమవారం 03 ఆగస్టు 2026

# 4 ఏపీ, ఆస్ట్రేలియా మధ్య ఒప్పందాలు

**ఐఐటీ తిరుపతిలో సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఏర్పాటు**

**విద్యార్థుల మానసిక ఆరోగ్యం, నైపుణ్యాభివృద్ధిపై ప్రత్యేక దృష్టి**

**మంత్రి లోకేష్ ఆస్ట్రేలియా పర్యటన ఫలితంగా కుదిరిన ఎంవోయూలు**

**లోకేష్, ఆస్ట్రేలియా మంత్రి జూలియన్ హిల్ సమక్షంలో సంతకాలు**



**అమరావతి ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** ఆంధ్రప్రదేశ్, ఆస్ట్రేలియా మధ్య బంధం మరింత బలపడింది. క్లీన్ ఎనర్జీ, అడ్వాన్స్‌డ్ మ్యానుఫ్యాక్చరింగ్, విద్య, నైపుణ్యాభివృద్ధి వంటి కీలక రంగాల్లో సహకారాన్ని పెంచుకుంటూ ఇరుపక్షాలు నాలుగు వ్యూహాత్మక ఒప్పందాలు (ఎంవోయూలు) కుదుర్చుకున్నాయి. ఉండవల్లిలో శనివారం జరిగిన ఈ కార్యక్రమానికి రాష్ట్ర విద్య, ఐటీ శాఖల మంత్రి నారా లోకేశ్, ఆస్ట్రేలియా అంతర్జాతీయ విద్య, అభివృద్ధి సహాయ మంత్రి జూలియన్ హిల్ హాజరయ్యారు. ఇటీవల మంత్రి నారా లోకేశ్ ఆస్ట్రేలియాలో పర్యటించిన సంగతి తెలిసిందే. ఆ పర్యటన సందర్భంగా అక్కడి సంస్థలతో జరిపిన చర్చలు, ఏపీలో పెట్టుబడులకు ఇచ్చిన ఆహ్వానం ఫలితంగానే ఈ ఒప్పందాలు సాకారమయ్యాయి.

**1. ఐఐటీ తిరుపతిలో సోలార్ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్**

మొదటి ఒప్పందం ప్రకారం, విశాఖలోని సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్ ఫర్ ఎనర్జీ ట్రాన్సిషన్ (జశీజుజు), ఐఐటీ తిరుపతి, ఆస్ట్రేలియాలోని మిగతా 2లో.

## వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం


### .. యువతకు ప్రధాని మోదీ పిలుపు

**వికసిత భారత్ సంకల్ప అభియాన్‌లో భాగంగా 'నశా ముక్త్ యువ' ప్రారంభం**


**మాదకద్రవ్యాలకు దూరంగా ఉండాలంటూ యువతకు ప్రధాని మోదీ పిలుపు**

**దేశవ్యాప్తంగా ప్రతి ఆదివారం క్రీడలు, అవగాహన కార్యక్రమాల నిర్వహణ**

**గతేడాది కాశీలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభమైనట్లు వెల్లడించిన ప్రధాని**



**ఢిల్లీ ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశ యువత మాదకద్రవ్యాల (డ్రగ్స్) మహమ్మారికి దూరంగా, శారీరకంగా, మానసికంగా సంపూర్ణ ఆరోగ్యంతో ఉన్నప్పుడే 'వికసిత భారత్' సంకల్పం నెరవేరుతుందని ప్రధాని నరేంద్ర మోదీ అన్నారు. డ్రగ్స్ రహిత సమాజ నిర్మాణంలో నేటి తరం యువత చూపిస్తున్న నిబద్ధత, సామాజిక స్పృహ తన నమ్మకాన్ని మరింత బలపరిచాయని ఆయన ప్రశంసించారు. మిగతా 2లో.



## యుద్ధానికి బ్రేక్..

**ఇరాన్‌తో ఒప్పందం కుదిరిందన్న ట్రంప్**

**ఇరాన్‌పై జరపాల్సిన దాడులను రద్దు చేసుకున్నట్టు ప్రకటించిన ట్రంప్**

**ఇరాన్, పశ్చిమాసియా దేశాల విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయమన్న అధ్యక్షుడు**

**హర్మ్యూజ్ జలసంధిని తెరవాలనేది ఒప్పందంలో కీలక షరతు**

**ఒప్పందానికి ఇజ్రాయెల్ కూడా అంగీకరించిందని వెల్లడి**

**అమెరికా దూకుడుగా వ్యవహరిస్తే తిప్పికొడతామని ఇరాన్ హెచ్చరిక**

**ఢిల్లీ ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** ఇరాన్ విషయంలో అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ అనూహ్య ప్రకటన చేశారు. ఇరాన్‌పై వారాంతంలో జరపాల్సిన దాడులను రద్దు చేసుకున్నట్టు ఆదివారం వెల్లడించారు. ఇరాన్‌తో పాటు ఇతర పశ్చిమాసియా దేశాలు చేసిన విజ్ఞప్తి మేరకే ఈ నిర్ణయం తీసుకున్నానని, ఓ ఒప్పందానికి మిగతా 2లో.

# రాష్ట్రాలకు ఫండింగ్

### ఏపీకి 4,597, తెలంగాణకు 2,370 కోట్లు

**ముందే పన్నుల వాటా నిధులు.. కేంద్రం సర్ప్రైజ్**

**అడగకుండానే లక్ష కోట్లకు పైగా విడుదల**

**ఉత్తరాదికి పెద్దమొత్తంలో దక్కిన నిధులవాటా**

**అత్యధికంగా యూపీకి 19,208, బీహారు 10,845 కోట్లు**




**ఢిల్లీ ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రాలకు కేంద్ర ప్రభుత్వం ఊహించని సర్ప్రైజ్ ఇచ్చింది. అభివృద్ధి పనుల వేగాన్ని పెంచడమేలక్ష్యంగా భారీ ఆర్థిక సాయాన్ని అందించింది. మామూలుగా ప్రతినెల ఇచ్చే పన్నుల వాటాతోసంబంధం లేకుండా, ఒకేసారి ఏకంగా 71,09,019 కోట్లను అడ్వాన్స్ వాయిదా రూపంలో రాష్ట్రాల ఖజానాలోకి జమ చేసింది. సాధారణంగా ప్రతి నెలా 10వ తేదీన కేంద్ర పన్నుల వాటా నిధులురాష్ట్రాలకు అందుతాయి. అయితే, ఈసారి ఆగస్టు 10న ఇచ్చే రెగ్యులర్ నిధులకు అదనంగా, పదిరోజుల ముందే ఈ భారీ అడ్వాన్సును కేంద్రం రిలీజ్ చేసింది. రాష్ట్రాల్లో మిగతా 2లో.

## వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

**ఆలూరు వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షిని అరెస్ట్ చేసిన పోలీసులు**

**టీడీపీ కార్యకర్త ఇంటిపై దాడి చేశారన్న ఆరోపణలు**

**ఎమ్మెల్యేతో పాటు మరో 14 మందిపై ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు**

**ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి ఎదుట నిందితుల హాజరు**

**అక్రమ అరెస్ట్ అంటూ వైసీపీ ఆరోపణ.. ఖండించిన ప్రభుత్వం**



2లో.



2లో.

## దేశంలో రుతుపవనాల వింత పోకడ..

**ఒకచోట కుండపోత, మరోచోట ఉక్కపోత!**

**దేశంలో అసమానంగా విస్తరించిన రుతుపవనాలు**

**జాతీయ స్థాయిలో 11 శాతం వర్షపాత లోటు నమోదు**

**పశ్చిమ భారత్‌లో దట్టమైన మేఘాలు.. ఉత్తరాదిన నిర్మలమైన ఆకాశం**

**ఉపగ్రహ చిత్రాల ద్వారా రుతుపవనాల వ్యత్యాసాన్ని చూపిన ఐఎండీ**

**ఆగస్టు 3 నుంచి ఉత్తర భారతంలో వర్షాలు మెరుగుపడే అవకాశం**

## తక్కువ ధరకే బియ్యం..

**సామాన్యులకు ఊరటనిస్తూ ప్రభుత్వ బియ్యం అమ్మకాలు**

**విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్**

**రైతు బజార్లు, మిల్లుల్లో కేజీ రూ. 50, రూ. 52కే బియ్యం**

**త్వరలో కందిపప్పు, పామాయిల్ కూడా తక్కువ ధరకే**

2లో.





2లో.

## లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

**మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు**

**సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారిని దర్శించుకున్న సీఎం రేవంత్**

**ప్రభుత్వం తరఫున జగన్మాతకు పట్టువస్త్రాలు, బోనం సమర్పణ**

**ముఖ్యమంత్రితో పాటు పాల్గొన్న మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క**

**అంగరంగ వైభవంగా జరుగుతున్న లష్కర్ బోనాల జాతర**

# వికసిత భారత్ కోసం డ్రగ్స్‌కు దూరం

**మొదటిపేజీ తరువాయి**

నేడు 'నశా ముక్త్ యువ ఫర్ వికసిత భారత్ సంకల్ప్ అభియాన్' కార్యక్రమాన్ని ప్రధాని వీడియో కాన్ఫరెన్సింగ్ ద్వారా ప్రారంభించి ప్రసంగించారు. దేశవ్యాప్తంగా యువతను ఏకతాటిపైకి తెచ్చి, మాదకద్రవ్యాల వ్యతిరేక ఉద్యమంలో భాగస్వాములను చేయడమే ఈ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. 'మై భారత్' వాలంటీర్ల నేతృత్వంలో ఇది ఒక ప్రజా భాగస్వామ్య (జన్ భాగీదారీ) ఉద్యమంగా రూపుదిద్దుకుంది. "మనం ఒక గొప్ప, ముఖ్యమైన సంకల్పం కోసం ఇక్కడ సమావేశమయ్యాం. ఈ కార్యక్రమం కేవలం ఒక వ్యక్తి, కుటుంబం లేదా సమాజం కోసం కాదు. ఇది దేశం కోసం. వికసిత భారత్ దిశగా దేశం అడుగులు వేస్తున్నప్పుడు, యువత డ్రగ్స్ సమస్యకు దూరంగా ఉండటం అత్యవసరం" అని ప్రధాని మోదీ స్పష్టం చేశారు.

ఈ సందర్భంగా కాశీతో ఈ కార్యక్రమానికి ఉన్న అనుబంధాన్ని ప్రధాని గుర్తుచేసుకున్నారు. "కాశీ ఎంపీగా, ఈ కార్యక్రమం గతేడాది పవిత్ర కాశీ క్షేత్రంలో పైలట్ ప్రాజెక్టుగా ప్రారంభం కావడం నాకు చాలా సంతోషాన్నిచ్చింది. దీనివల్ల ఈ కార్యక్రమానికి శాస్త్రీయ దృక్పథంతో పాటు ఆధ్యాత్మిక శక్తి, సాధువుల ఆశీస్సులు, సాంస్కృతిక వారసత్వం కూడా తోడయ్యాయి" అని ఆయన అన్నారు. 2025 జులైలో వారణాసిలో జరిగిన యూత్ స్పిరిచ్యువల్ సమ్మిట్‌లో దేశంలోని 125 ఆధ్యాత్మిక సంస్థలు ఐదేళ్ల రోడ్‌మ్యాప్‌తో 'కాశీ డిక్లరేషన్'ను ఆమోదించాయని, వారంతా లక్షలాది పౌరులకు సేవ చేస్తున్నారని మోదీ వివరించారు. యువతను దేశానికి 'అమృత తరం' (అమృత్ పీఢి)గా అభివర్ణించిన ప్రధాని.. "రాబోయే 20-25 ఏళ్లలో మీ జీవితాలకు మీరే దిశానిర్దేశం చేసుకుంటారు. 2047 నాటికి వికసిత భారత్ సంకల్పాన్ని సాకారం చేసేది మీరే. ఆ విజయాన్ని సంపూర్ణంగా ఆస్వాదించేది కూడా మీరే. దేశానికి మీ శక్తి, సృజనాత్మకత, ప్రతిభ ఎంతో అవసరం. కాబట్టి దేశం కోసం, మీ సొంత జీవితాల కోసం డ్రగ్స్‌కు దూరంగా ఉండండి" అని పిలుపునిచ్చారు.

ఈ ప్రచారంలో భాగంగా ప్రతి ఆదివారం దేశవ్యాప్తంగా క్రీడా కార్యక్రమాలు, వాకథాన్‌లు, ధ్యాన శిబిరాలు, సాంస్కృతిక ప్రదర్శనలు, అవగాహన కార్యక్రమాలు నిర్వహిస్తారు. 'మాదకద్రవ్యాలకు దూరంగా ఉండే యువతే వికసిత భారత్‌కు అసలైన బలం' అనే సందేశాన్ని దేశంలోని ప్రతి యువకుడికి చేర్చడమే ఈ ఉద్యమ లక్ష్యమని నిర్వాహకులు తెలిపారు.

# యుద్ధానికి బ్రేక్..

**మొదటిపేజీ తరువాయి**

సంబంధించిన పరిమితులపై అంగీకారం కుదిరిందని ఆయన తెలిపారు. అయితే, ఈ ఒప్పందం వేగంగా ఖరారైతేనే దాడుల విరమణ కొనసాగుతుందని స్పష్టం చేశారు.'ట్రూత్ సోషల్' వేదికగా ట్రంప్ ఈ వివరాలు పంచుకున్నారు. త్వరలో కుదరబోయే ఒప్పందం ప్రకారం.. హార్మూజ్ జలసంధిని తక్షణమే, సంపూర్ణంగా తెరవడంతో పాటు, ఇరాన్ అణు ముప్పునకు ముగింపు పలకాల్సి ఉంటుందని స్పష్టం చేశారు. "ఒప్పందం పరిమితులపై అంగీకారం కుదిరినందున, ఎటువంటి దాడికి పాల్పడవద్దని ఇరాన్, ఇతర పశ్చిమాసియా దేశాలు మమ్మల్ని కోరాయి. ఈ విజ్ఞప్తి ఆధారంగా, ప్రపంచ ప్రయోజనాల దృష్ట్యా దాడిని రద్దు చేసేందుకు అంగీకరించాను" అని ట్రంప్ తన పోస్ట్‌లో రాశారు.గత ఐదు నెలలుగా కొనసాగుతున్న యుద్ధానికి ముగింపు పలికే ఈ ఒప్పందం పూర్తి చేసే ప్రయత్నంలో అమెరికాతో చేతులు కలిపేందుకు ఇజ్రాయెల్ కూడా అంగీకరించిందని ట్రంప్ పేర్కొన్నారు. అయితే, ఈ అంశంపై ఇజ్రాయెల్ నుంచి తక్షణమే ఎలాంటి అధికారిక ప్రకటన వెలువడలేదు.

మరోవైపు, అమెరికా ఎలాంటి సాహసోపేత చర్యలకు పాల్పడవద్దని టెహ్రాన్ ఈ వారాంతంలో తీవ్రంగా హెచ్చరించింది. ఇరాన్ లక్ష్యాలపై కొత్త దాడులు చేస్తామన్న ట్రంప్ బెదిరింపులను నిజం చేస్తే, నిర్ణయాత్మకంగా ప్రతీకారం తీర్చుకుంటామని స్పష్టం చేసింది. శనివారం టర్కీ, పాకిస్థాన్, సౌదీ అరేబియా ఉన్నతాధికారులతో ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ వేర్వేరుగా ఫోన్‌లో మాట్లాడారు. అమెరికా 'అస్థిరపరిచే చర్యల' వల్ల కలిగే పరిణామాల గురించి ఆయన చర్చించారు. ఏదైనా దురాక్రమణకు పాల్పడితే గట్టిగా బదులిస్తామని స్పష్టం చేశారు. ఇదే సమయంలో, తమ దేశంలోని పలు కీలక కేంద్రాలపై ఇరాన్ ప్రయోగించిన డ్రోన్లను ధ్వంసం చేసినట్లు కువైట్ సైన్యం ప్రకటించింది.

# లష్కర్ బోనాల్లో సీఎం రేవంత్ రెడ్డి..

**మహంకాళి అమ్మవారికి పట్టువస్త్రాలు**

**హైదరాబాద్ 02(పిసిడబ్ల్యూ న్యూస్):** సికింద్రాబాద్‌లోని శ్రీ ఉజ్జయిని మహంకాళి అమ్మవారి బోనాల జాతర అంగరంగ వైభవంగా, భక్తిశ్రద్ధలతో కొనసాగుతోంది. ఈ ఉత్సవాల్లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి పాల్గొని, అమ్మవారిని దర్శించుకున్నారు. రాష్ట్ర ప్రభుత్వం తరఫున ఆయన జగన్మాతకు బోనం, పట్టువస్త్రాలు సమర్పించి ప్రత్యేక పూజలు నిర్వహించారు.లష్కర్ బోనాల జాతరలో భాగంగా



ఆలయానికి విచ్చేసిన ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డికి ఆలయ అధికారులు, అర్చకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. అనంతరం ఆయన గర్భగుడిలో మహంకాళి అమ్మవారిని దర్శించుకుని, మొక్కులు చెల్లించుకున్నారు. తెలంగాణ ప్రజలు సుఖసంతోషాలతో, పాడిపంటలతో వర్ధిల్లాలని అమ్మవారిని ప్రార్థించారు.ఈ కార్యక్రమంలో ముఖ్యమంత్రితో పాటు రాష్ట్ర మంత్రులు కొండా సురేఖ, పొన్నం ప్రభాకర్, సీతక్క, కాంగ్రెస్ ఎమ్మెల్యే దానం నాగేందర్, బీఆర్ఎస్ శాసనసభ్యుడు తలసాని శ్రీనివాస్ యాదవ్ కూడా పాల్గొన్నారు. వారు కూడా అమ్మవారికి పూజలు చేసి, తీర్థ ప్రసాదాలు స్వీకరించారు. వీరితో పాటు పలువురు ప్రజాప్రతినిధులు, అధికారులు కూడా ఈ వేడుకల్లో పాలుపంచుకున్నారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా ఆలయ పరిసరాల్లో పోలీసులు పటిష్ఠ బందోబస్తు ఏర్పాటు చేశారు.

# తక్కువ ధరకే బియ్యం..

**విజయవాడలో కార్యక్రమాన్ని ప్రారంభించిన మంత్రి నాదెండ్ల మనోహర్**

**విజయవాడ ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని సామాన్య, మధ్యతరగతి ప్రజలకు ఊరట కల్పిస్తూ కూటమి ప్రభుత్వం కీలక నిర్ణయం తీసుకుంది. బహిరంగ మార్కెట్‌లో పెరుగుతున్న బియ్యం ధరలను నియంత్రించేందుకు, తక్కువ ధరకే నాణ్యమైన బియ్యాన్ని అందించే కార్యక్రమానికి శ్రీకారం చుట్టింది. రాష్ట్రవ్యాప్తంగా 130 రైతు బజార్లు, 500 రైస్ మిల్లుల వద్ద ప్రత్యేక కౌంటర్ల ద్వారా సబ్సిడీ బియ్యం విక్రయాలను ఆదివారం




ప్రారంభించింది. విజయవాడలోని ఏపీఐఐసీ రైతు బజార్‌లో రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్ ఈ కార్యక్రమాన్ని లాంఛనంగా ప్రారంభించి, ప్రజలకు స్వయంగా బియ్యాన్ని అందజేశారు.ఈ పథకం కింద బీపీటీ సూపర్ ఫైన్ రకం బియ్యాన్ని కిలో రూ. 52కు, బీపీటీ రా రైస్‌ను కిలో రూ. 50కే విక్రయిస్తున్నారు. ఆధార్ కార్డు చూపించి ఒక వ్యక్తి 10 కిలోల వరకు బియ్యం కొనుగోలు చేయవచ్చు. బహిరంగ మార్కెట్‌లో రూ. 60 నుంచి రూ. 65 వరకు పలుకుతున్న ఈ రకం బియ్యాన్ని ప్రభుత్వం తక్కువ ధరకే అందుబాటులోకి తేవడంపై ప్రజలు హర్షం వ్యక్తం చేస్తున్నారు. రాష్ట్ర పౌరసరఫరాల శాఖ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం సంయుక్తంగా ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాయి.ఈ సందర్భంగా మంత్రి నాదెండ్ల మనోహర్ మాట్లాడుతూ.. "ప్రజలకు కష్టం రాకముందే వారిని ఆదుకునే ప్రభుత్వం మాది. మార్కెట్‌లో బియ్యం ధరలను సమీక్షించి, సామాన్యుడిపై భారం పడకుండా తక్కువ ధరకే బియ్యం అందించాలని నిర్ణయించాం. మా విజ్ఞప్తికి రైస్ మిల్లర్లు సానుకూలంగా స్పందించి సహకరించడం అభినందనీయం" అని తెలిపారు. భవిష్యత్తులో కందిపప్పు, పామాయిల్‌ను కూడా తక్కువ ధరలకు అందించేందుకు కేంద్ర ప్రభుత్వంతో చర్చిస్తున్నామని ఆయన వెల్లడించారు. ప్రజలందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని కోరారు.ఈ కార్యక్రమంలో విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహన రావు, పౌరసరఫరాల శాఖ డైరెక్టర్ నూపుర్, ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ లక్ష్మీశ, రాష్ట్ర రైస్ మిల్లర్ల సంఘం అధ్యక్షుడు గుమ్మడి వెంకటేశ్వరరావు, జనసేన నేత అమ్మిశెట్టి వాసు తదితరులు పాల్గొన్నారు.

# దేశంలో రుతుపవనాలవింత పోకడ..

**ఒకచోట కుండపోత, మరోచోట ఉక్కపోత!**

**హైదరాబాద్ ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** దేశంలో నైరుతి రుతుపవనాలు విస్తరించినప్పటికీ, వాటి గమనం అసమానంగా, బలహీనంగా కొనసాగుతోంది. ఒకవైపు కొన్ని ప్రాంతాల్లో భారీ వర్షాలు కురుస్తుండగా, మరోవైపు అనేక ప్రాంతాలు వర్షాల కోసం ఎదురుచూస్తున్నాయి. ఇప్పటికీ పలు ప్రాంతాల్లో వేడిమితో ఉక్కపోత పరిస్థితులు నెలకొన్నాయి. జాతీయ స్థాయిలో ఇప్పటివరకు 11 శాతం వర్షపాత లోటు నమోదైంది. ఈ పరిస్థితిని భారత వాతావరణ శాఖ (ఐఎండీ), ఇస్రో సంయుక్తంగా పంపిన ఇన్శాట్-3డీఎస్ ఉపగ్రహ చిత్రాలు స్పష్టంగా కళ్లకు కడుతున్నాయి.వాతావరణ శాఖ విడుదల చేసిన తాజా గణాంకాల ప్రకారం, జూన్ 4 నుంచి ఇప్పటివరకు దేశంలో 446.3 మిల్లీమీటర్ల సాధారణ వర్షపాతానికి బదులుగా కేవలం 395.5 మిల్లీమీటర్ల వర్షపాతమే నమోదైంది. ఉపగ్రహ చిత్రాల్లో పశ్చిమ, మధ్య భారతదేశంపై దట్టమైన మేఘాలు ఆవరించి ఉండగా, గంగా-సింధు మైదాన ప్రాంతాలైన ఢిల్లీ, హర్యానా, పంజాబ్, ఉత్తరప్రదేశ్‌లోని చాలా ప్రాంతాల్లో ఆకాశం నిర్మలంగా కనిపిస్తోంది.ప్రస్తుతం గుజరాత్, దాని పరిసర ప్రాంతాల్లో క్రియాశీలంగా ఉన్న వాతావరణ వ్యవస్థ కారణంగా అక్కడ విస్తారంగా వర్షాలు కురుస్తున్నాయి. దీనికి విరుద్ధంగా, వాయువ్య భారతదేశంలో రుతుపవనాల కదలికలు బలహీనంగా ఉన్నాయి. అయితే, రుతుపవన ద్రోణి ఉత్తరం వైపు కదిలే అవకాశం ఉండటంతో రాబోయే రోజుల్లో ఉత్తరాది రాష్ట్రాల్లో పరిస్థితి మెరుగుపడొచ్చని వాతావరణ శాఖ అంచనా వేస్తోంది.ఆదివారం (ఆగస్టు 2) నుంచి ఢిల్లీ, హర్యానా, పంజాబ్, యూపీల్లో తేలికపాటి జల్లులు కురిసే అవకాశం ఉంది. ఆగస్టు 3 నుంచి 5 మధ్య వర్షాలు పుంజుకుని, 40 నుంచి 70 శాతం ప్రాంతాల్లో మోస్తరు నుంచి భారీ వర్షాలు (40-100 మి.మీ.) కురవొచ్చని తెలిపింది. మరోవైపు, దక్షిణ, మధ్య రాజస్థాన్‌లో ఆది, సోమవారాల్లో భారీ వర్షాలు పడే సూచనలు ఉన్నాయి. మొత్తం మీద, కొన్ని పశ్చిమ ప్రాంతాలు వరదలతో సతమతమవుతుండగా, ఉత్తరాది ప్రాంతాలు విస్తారమైన వర్షాల కోసం ఇంకా ఎదురుచూస్తున్నాయి.

# రాష్ట్రాలకు ఫండింగ్

**మొదటిపేజీ తరువాయి**

మౌలిక సదుపాయాల కల్పన,రోడ్లు, ప్రాజెక్టులు వంటి 'క్యాపిటల్ ఎక్స్ పెండిచర్' పనులను వేగవంతం చేయడానికే ఈ ముందస్తుపంపిణీ చేపట్టినట్లు ప్రభుత్వం స్పష్టం చేసింది. చేతిలో సరిపడా నిధులు ఉంటే రాష్ట్రాలు అభివృద్ధి పనుల్లో మరింత అగ్రెసివ్గా ముందుకెళ్తాయని కేంద్రం భావిస్తోంది.

**యూపీకి అత్యధిక నిధులు!**

కేంద్రం విడుదల చేసిన మొత్తంలో జనాభా, ఆర్థిక సంఘం సిఫార్సుల ప్రకారం అత్యధిక లబ్ధి పొందిన రాష్ట్రంగా ఉత్తరప్రదేశ్ నిలిచింది. యూపీకి అత్యధికంగా 3 19,208 కోట్లు దక్కాయి. ఆ తర్వాత స్థానాల్లో బిహార్కు 10,845 కోట్లు, మధ్యప్రదేశ్ ప్రభుత్వానికి 78,010 కోట్లు కేటా యించారు. అలాగే పశ్చిమ బెంగాల్ కు 37,866 కోట్లు, మహారాష్ట్రకు 37,022 కోట్లు లభించాయి. ఏపీ, తెలంగాణ రాష్ట్రాలకు..

దక్షిణాది రాష్ట్రాలకు కేంద్ర నిధుల కేటాయింపు భారీగానే జరిగింది. ఆంధ్రప్రదేశ్కు 4,597 కోట్లు దక్కగా, తెలంగాణ రాష్ట్రానికి 2,370 కోట్లు కేటాయించారు. కర్ణాటకకు 4,504 కోట్లు, తమిళనాడుకు 4,466 కోట్లు అందాయి. రాజస్థాన్ ఖాతాలో 76,460 కోట్లు, ఒడిశాకు 4,819 కోట్లు జమయ్యాయి. చిన్న రాష్ట్రాల విషయా నికొస్తే సిక్కింకు 7365 కోట్లు, గోవాకు 398 కోట్లు, నాగాలాండ్కు 3524 కోట్లు కేటాయించారు.

**ఏమిటీ ట్యాక్స్ డెవల్యూషన్ ?**

దేశంలో కేంద్ర ప్రభుత్వం సేకరించే వివిధ రకాల పన్నుల ద్వారా వచ్చే ఆదాయంలో ఒక నిర్దిష్ట శాతాన్ని రాష్ట్రాలకు పంచాల్సి ఉంటుంది. దీనినే ఆర్థిక భాషలో 'ట్యాక్స్ డెవల్యూషన్' అంటారు. ఫైనాన్స్ కమీషన్ నిర్దేశించిన ఫార్ములా ఆధారంగా ఏ రాష్ట్రానికి ఎంత ఇవ్వాలో లెక్కిస్తారు. రాష్ట్రాలు తమ సొంత బడ్జెట్ నిర్వహణకు, ప్రజారోగ్య, సంక్షేమ పథకాలను నిరంతరాయంగా అమలు చేయ డానికి ఈ నిధులే ప్రాణాధారం. కాగా, ఆగస్టు 10న యథావిధిగా ఇచ్చే క్రమబద్ధమైన నెలవారీ పన్నుల వాటాను కేంద్రం వేరేగా విడుదల చేయనుంది. ఒకే నెలలో రెండుసార్లు నిధులు అందుతుండటంతో రాష్ట్రాల ఆర్థిక ఇబ్బందులు చాలావరకు తొలగిపోనున్నాయి.

# ఏపీ, ఆస్ట్రేలియా మధ్య 4 కీలక ఒప్పందాలు

**మొదటిపేజీ తరువాయి**

యూనివర్సిటీ ఆఫ్ న్యూ సౌత్ వేల్స్ కలిసి ఐఐటీ తిరుపతి ప్రాంగణంలో 'సోలార్ తయారీ సెంటర్ ఆఫ్ ఎక్సలెన్స్'ను ఏర్పాటు చేయనున్నాయి. దీని ద్వారా ఏపీని సోలార్ తయారీ, పరిశోధన, ఆవిష్కరణలకు జాతీయ కేంద్రంగా తీర్చిదిద్దడం లక్ష్యం. ఈ సెంటర్‌లో అధునాతన సోలార్ పీవీ తయారీ, ప్యానెళ్ల రీసైక్లింగ్, సర్క్యులర్ ఎకానమీ వంటి అంశాలపై పరిశోధనలు జరుగుతాయి. సోలార్ సెల్ ఫిజిక్స్, మాన్యుఫ్యాక్చరింగ్, వాఫరింగ్ టెక్నాలజీస్ వంటి అంశాలపై కరిక్యులమ్, శిక్షణా కార్యక్రమాలను ఖచీూఔ రూపొందించి సహకారం అందిస్తుంది.

**2. సమ్మిళిత విద్య బలోపేతం కోసం** రెండో ఒప్పందం సమ్మిళిత విద్యపై దృష్టి సారించింది. యూఎన్ఎస్‌డబ్ల్యూ, శ్రీ పద్మావతి మహిళా విశ్వవిద్యాలయం, ఏపీ సమగ్ర శిక్ష సంయుక్తంగా ఈ ఒప్పందంపై సంతకాలు చేశాయి. ఆటిజం, ఇతర న్యూరోడైవర్స్ విద్యార్థులకు మెరుగైన బోధన అందించేందుకు ఉపాధ్యాయుల సామర్థ్యాన్ని పెంచడం దీని ముఖ్య ఉద్దేశం. స్పెషల్ ఎడ్యుకేటర్లకు ప్రత్యేక శిక్షణ ఇవ్వడంతో పాటు, రాష్ట్ర విద్యార్థుల అవసరాలకు అనుగుణంగా బోధనా వనరులను రూపొందిస్తారు. **3. విద్యార్థుల మానసిక ఆరోగ్యంపై పైలట్ ప్రాజెక్ట్** మూడో ఒప్పందంలో భాగంగా ఏపీ ఉన్నత విద్యా మండలి, ఆస్ట్రేలియాకు చెందిన రీబౌండ్ డింపుల్ ప్రైవేట్ లిమిటెడ్ కలిసి రాష్ట్రంలోని ఎంపిక చేసిన విద్యాసంస్థల్లో పైలట్ ప్రాజెక్టు చేపట్టనున్నాయి. విద్యార్థుల మానసిక ఆరోగ్య పరిరక్షణే దీని లక్ష్యం. ప్రత్యేకంగా రూపొందించిన వేదిక ద్వారా విద్యార్థులు తమ గోప్యతకు భంగం కలగకుండా మానసిక ఆరోగ్య సలహాలు, వర్చువల్ కౌన్సెలింగ్ సేవలను పొందవచ్చు. ఈ పైలట్ ప్రాజెక్టును ఉచితంగా అమలు చేయనున్నారు.

**4. నైపుణ్యాభివృద్ధికి డీఎల్ఎస్‌తో భాగస్వామ్యం**

నాలుగో ఒప్పందం ఏపీ నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆస్ట్రేలియాకు చెందిన డైనమిక్ లెర్నింగ్ సర్వీసెస్ ) మధ్య కుదిరింది. వృత్తి విద్య, నైపుణ్యాభివృద్ధి, అంతర్జాతీయ ఉపాధి అవకాశాలను మెరుగుపరచడం కోసం ఇరు సంస్థలు కలిసి పనిచేస్తాయి. పరిశ్రమల అవసరాలకు తగ్గట్టుగా శిక్షణా కార్యక్రమాలను రూపొందించి, ప్రొఫెషనల్ సర్టిఫికేషన్ అందించడం దీని ప్రధాన లక్ష్యం.ఈ ఒప్పందాలకు ముందు ఆస్ట్రేలియా ప్రతినిధి బృందం ముఖ్యమంత్రి చంద్రబాబుతో మర్యాదపూర్వకంగా భేటీ అయింది. ఏపీలో ఉన్న అవకాశాలను సీఎం వారికి వివరించారు. ఈ కార్యక్రమంలో విద్యాశాఖ కార్యదర్శి కోన శశిధర్, ఐఐటీ తిరుపతి డైరెక్టర్ డా.సత్యనారాయణ్, చెన్నైలోని ఆస్ట్రేలియా కాన్సుల్ జనరల్ సిలై జాకీ సహా పలువురు ఉన్నతాధికారులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

# వైసీపీ ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్ట్..

**ఆలూరు ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** కర్నూలు జిల్లా ఆలూరు నియోజకవర్గంలో రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. టీడీపీ కార్యకర్తలపై దాడికి పాల్పడ్డారన్న ఆరోపణలపై అధికార వైసీపీకి చెందిన స్థానిక ఎమ్మెల్యే బి. విరూపాక్షిని, ఆయన కుమారుడు చంద్రశేఖర్‌ను పోలీసులు శనివారం అర్ధరాత్రి అరెస్ట్ చేశారు. ఆయనతో పాటు మరో 13 మందిని కూడా అదుపులోకి తీసుకున్నారు. అరెస్టయిన వారందరినీ ఆదివారం ఆలూరు జూనియర్ సివిల్ జడ్జి కోర్టు ఎదుట హాజరుపరిచారు.

## అసలేం జరిగింది?

చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో శనివారం రాత్రి టీడీపీ, వైసీపీ వర్గాల మధ్య తీవ్ర ఘర్షణ చోటుచేసుకుంది. ఈ ఘటనలో దాడులు, దౌర్జన్యాలు జరిగాయని ఆరోపణలు వెల్లువెత్తాయి. టీడీపీ కార్యకర్త శేఖర్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు రంగంలోకి దిగారు. ఎమ్మెల్యే విరూపాక్షితో సహా మొత్తం 15 మందిపై ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు.

## పోలీసుల కథనం ప్రకారం..

వైసీపీ నేత గిరి, టీడీపీ నేతలైన గురునాథ్, శివ, నాగరాజు మధ్య మొదలైన వాగ్వాదం ఘర్షణకు దారితీసింది. గిరి ఫోన్ చేయడంతో ఎమ్మెల్యే విరూపాక్షి సుమారు 10 కార్ల కాన్వాయ్‌తో గ్రామానికి చేరుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే సమక్షంలోనే ఆయన అనుచరులు టీడీపీ నేత నాగరాజు ఇంట్లోకి చొరబడి దాడికి పాల్పడ్డారు. అడ్డుకోబోయిన మహిళ సుచిత్రపై కూడా చేయి చేసుకున్నారని, మరో నేత కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారని పోలీసులు తెలిపారు. దళిత వ్యక్తి ఇంటిపై దాడి చేసి, ఆయన భార్యపై చేయి చేసుకున్న ఘటన కావడంతోనే ఎస్సీ, ఎస్టీ కేసు నమోదు చేసి అరెస్ట్ చేసినట్లు వివరించారు.

## అక్రమ అరెస్ట్ అంటున్న వైసీపీ

అయితే, ఈ అరెస్టును వైసీపీ నేతలు తీవ్రంగా ఖండిస్తున్నారు. ఇది కక్షపూరితమైన, అక్రమ అరెస్ట్ అని ఆరోపించారు. తమ పార్టీ నేత గిరి ఇంటిపై టీడీపీ నాయకులే మొదట దాడికి ప్రయత్నించగా, ఎమ్మెల్యే విరూపాక్షి అక్కడికి విచారణకు వెళ్లారని తెలిపారు. ఆ సమయంలో టీడీపీ కార్యకర్తలు రాళ్లు రువ్వడంతో ఎమ్మెల్యే సోదరుడు శ్రీరాముకు గాయాలయ్యాయని చెప్పారు. తాము ఫిర్యాదు చేసినా పట్టించుకోని పోలీసులు, అర్ధరాత్రి ఎమ్మెల్యేను, ఆయన కుమారుడిని అక్రమంగా అరెస్ట్ చేశారని ఆరోపించారు. ఎమ్మెల్యే ఇంటిలోని సీసీటీవీ హార్డ్ డిస్క్‌లను కూడా పోలీసులు తీసుకెళ్లారని వారు పేర్కొన్నారు.

## ఫ్యాక్ట్ చెక్ తో బదులిచ్చిన ఏపీ ప్రభుత్వం

ఆలూరు ఎమ్మెల్యే విరూపాక్షి అక్రమ అరెస్టు అంటూ జరుగుతున్న ప్రచారం పూర్తిగా అసత్యం అని ఏపీ ప్రభుత్వ ఫ్యాక్ట్ చెక్ విభాగం స్పష్టం చేసింది. ఈ మేరకు సోషల్ మీడియాలో ఓ ప్రకటన విడుదల చేసింది. "ఎస్సీ వర్గానికి చెందిన ఒక వ్యక్తి ఇంటిపై దాడి చేసి అతని భార్య పై దౌర్జన్యం చేసి ఆమె వస్త్రాలు చించిన కేసులో ఎమ్మెల్యే విరూపాక్షి అరెస్టు అయ్యారు. వాస్తవం ఏమిటంటే.. ఆలూరు నియోజకవర్గం, చిప్పగిరి మండలం సంగాల గ్రామంలో ఒక పార్టీ నాయకుడు గిరి (యాదవ్), మరొక పార్టీ నాయకులైన గురునాథ్ (యాదవ్), శివ, నాగరాజు (ఎస్సీ మాదిగ) లను అసభ్య పదజాలంతో మాట్లాడారు. ఎందుకు అలా మాట్లాడావని నాగరాజు ప్రశ్నించినందుకు గిరి ఎమ్మెల్యే విరూపాక్షికి ఫోన్ చేయగా, ఆయన తన అనుచరులతో కలిసి సుమారు 10 కార్లలో అక్కడకు చేరుకున్నారు. వారు నాగరాజు ఇంటిలోకి దౌర్జన్యంగా చొరబడి, ఎమ్మెల్యే సమక్షంలోనే ఇంట్లోని వస్తువులను ధ్వంసం చేశారు. ఈ దాడిని అడ్డుకోవడానికి ప్రయత్నించిన నాగరాజు భార్య సుచిత్రపై చేయిచేసుకుని ఆమె నైటీని చింపేశారు. అలాగే వారిని వారించబోయిన రాజశేఖర్, నాగరాజు అన్నపై కూడా విచక్షణారహితంగా దాడి చేశారు. ఈ విషయం తెలుసుకుని పరామర్శించడానికి వచ్చిన స్థానిక నాయకుడు కొండా పురుషోత్తం కారును ధ్వంసం చేశారు. ఈ ఘటనలో గాయపడిన బాధితులను చికిత్స నిమిత్తం ఆలూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోలీసులు నిందితులను అరెస్టు చేశారు. జరిగింది ఇది కాగా అక్రమంగా పోలీసులు అరెస్టు చేసినట్లు ప్రచారం చేయడం సబబు కాదు" అని ఏపీ ఫ్యాక్ట్ చెక్ వివరించింది.కాగా, ఈ అరెస్టులతో ఆలూరు నియోజకవర్గంలో అధికార టీడీపీ, ప్రతిపక్ష వైసీపీ మధ్య రాజకీయ ఉద్రిక్తతలు తారస్థాయికి చేరాయి. ఎలాంటి అవాంఛనీయ ఘటనలు జరగకుండా పోలీసులు భారీ బందోబస్తు ఏర్పాటు చేసి, శాంతిభద్రతలను పర్యవేక్షిస్తున్నారు.

## ప్రజలు ఎన్నుకున్న విరూపాక్షి ఏమైనా ఉగ్రవాదా?: జగన్



రాష్ట్రంలో తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి రాజకీయ కక్ష సాధింపు చర్యలకు పాల్పడుతోందని, 'నారాసుర పాలన'లో అరాచకం పరాకాష్ఠకు చేరిందని వైసీపీ అధినేత జగన్ తీవ్రస్థాయిలో ధ్వజమెత్తారు. దాడి చేసిన అధికార పార్టీ వారికి రక్షణ కల్పిస్తూ, బాధితులైన ప్రతిపక్ష నేతలపైనే హత్యాయత్నం వంటి తీవ్రమైన కేసులు బనాయిస్తున్నారని ఆయన మండిపడ్డారు. ఇది ప్రజాస్వామ్యమా, పోలీస్ రాజ్యమా లేక జంగిల్ రాజ్యమా అని ముఖ్యమంత్రి చంద్రబాబును ఆయన సూటిగా ప్రశ్నించారు. ఈ మేరకు ఆయన ఒక సుదీర్ఘ ప్రకటన విడుదల చేశారు.

# ప్రభుత్వ ల్యాబ్ టెక్నీషియన్ల సమస్యలు తక్షణమే పరిష్కరించాలి

### తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ డిమాండ్



**హనుమకొండ, ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** వైద్య ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ల్యాబ్ టెక్నీషియన్స్ గ్రేడ్-2 సమస్యలను ప్రభుత్వం వెంటనే పరిష్కరించాలని తెలంగాణ యునైటెడ్ మెడికల్ అండ్ హెల్త్ ఎంప్లాయిస్ యూనియన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కె. యాద నాయక్ డిమాండ్ చేశారు. ఆదివారం రోజున సుందరయ్య విజ్ఞాన కేంద్రంలో యూనియన్ రాష్ట్ర అధ్యక్షుడు ఎండి పసియుద్దీన్ అధ్యక్షతన 2026 బ్యాచ్ ల్యాబ్ టెక్నీషియన్ల అభినందన సభ నిర్వహించారు. ఈ సందర్భంగా యాద నాయక్ మాట్లాడుతూ... రోగ నిర్ధారణలో కీలక పాత్ర పోషిస్తున్న ల్యాబ్ టెక్నీషియన్లకు సర్వీస్ మొత్తంలో ఒక్క ప్రమోషన్ కూడా రాకపోవడం విచారకరమన్నారు. వారికి వెంటనే ప్రమోషన్ ఛానల్ ఏర్పాటు చేయాలని, పెండింగ్‌లో ఉన్న 6 డీఏలను విడుదల చేయాలని కోరారు. అలాగే సిపిఎస్ రద్దు చేసి ఓపిఎస్ అమలు చేయాలని, 51% ఫిట్‌మెంట్‌తో పిఆర్సిని ప్రకటించాలని డిమాండ్ చేశారు. సభలో యూనియన్ రాష్ట్ర నాయకుడు మామిడి ఆదిత్య ప్రవేశపెట్టిన పలు తీర్మానాలను ఏకగ్రీవంగా ఆమోదించారు. 'ల్యాబ్ టెక్నీషియన్' పేరును 'ల్యాబ్ ఆఫీసర్'గా మార్చాలి. సౌకర్యాలు, అలవెన్సులు, రిస్క్ అలవెన్స్ పెంచడంతో పాటు పని ప్రదేశాల్లో కనీస మౌలిక సదుపాయాలు కల్పించాలి. పే-స్కేల్స్‌లో ఉన్న వ్యత్యాసాలను వెంటనే సవరించాలి. ఈ సమస్యల పరిష్కారానికి భవిష్యత్తులో ఐక్య పోరాటాలు చేస్తామని నేతలు స్పష్టం చేశారు. అనంతరం నూతనంగా ఎంపికైన ల్యాబ్ టెక్నీషియన్లను ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో యూనియన్ రాష్ట్ర కోశాధికారి విభూలక్ష్మి, నాయకులు విజయ వర్ధన్ రాజు, సుధాకర్, కిరణ్మయి, సంగమేశ్వర్, భాస్కర్ తదితరులు పాల్గొన్నారు.

# న్యూ వరంగల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'ఓ సిటీ'లో మెగా ఉచిత వైద్య శిబిరం




**వరంగల్, ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు అందించే లక్ష్యంతో న్యూ వరంగల్ హాస్పిటల్ ఆధ్వర్యంలో 'ఓ సిటీ' క్లబ్ హౌస్‌లో నిర్వహించిన మెగా ఉచిత ఆరోగ్య శిబిరం విజయవంతమైంది. ఈ శిబిరాన్ని ముఖ్య అతిథిగా హాజరైన ఎర్రబెల్లి ప్రదీప్ రావు గారు ప్రారంభించారు. సమాజ ఆరోగ్య పరిరక్షణలో ఇటువంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం అభినందనీయమని ఆయన కొనియాడారు. ఈ శిబిరంలో ప్రముఖ వైద్య నిపుణులు డా. రాంబాబు (జనరల్ ఫిజీషియన్), డా. ప్రశాంత్ (ఆర్థోపెడిక్), డా. ప్రశాంత్ (న్యూరో ఫిజీషియన్), డా. రెహ్మాన్ షరీఫ్ (జనరల్ సర్జన్) పాల్గొని స్థానిక ప్రజలకు వైద్య పరీక్షలు నిర్వహించి, ఉచిత సలహాలు అందించారు. ఈ కార్యక్రమంలో 'ఓ సిటీ' క్లబ్ హౌస్ పాలకవర్గ ప్రతినిధులు చంద్రశేఖర్ జోగు, శ్రీనివాస్ రెడ్డి బొబ్బల, భాజూరి వేణుగోపాల్ పాల్గొని సహకారం అందించారు. శిబిరం విజయవంతం కావడానికి కృషి చేసిన హాస్పిటల్ సీఈఓ ఎం. విష్ణు మోహన్ రెడ్డి, మేనేజర్ ఎ. వైష్ణవి, మార్కెటింగ్ టీమ్, వైద్య సిబ్బందికి యాజమాన్యం ధన్యవాదాలు తెలిపింది. ప్రజారోగ్యమే ధ్యేయంగా "సేవే పరమో ధర్మః" అనే నినాదంతో న్యూ వరంగల్ హాస్పిటల్ ఎల్లప్పుడూ ముందుంటుందని ప్రతినిధులు స్పష్టం చేశారు.

# మాల్ గోదాం కార్మికుల హక్కులకై నిరంతర పోరాటం

### ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలని కేంద్రానికి విజ్ఞప్తి

### బి ఆర్ ఎం జి ఎస్ ఎస్ జాతీయ ఇన్చార్జి మనోరంజన్ కుమార్ పాశ్వన్



**హైదరాబాద్, ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** భారతీయ రైల్వే మాల్ గోదాం కార్మికుల సంక్షేమం, హక్కుల పరిరక్షణే తమ సంఘం ప్రధాన లక్ష్యమని భారతీయ రైల్వే మాల్ గోదాం శ్రామిక్ సంఘ్ (బి ఆర్ ఎం జి ఎస్ ఎస్) జాతీయ ఇన్చార్జి మనోరంజన్ కుమార్ పశ్వన్ అన్నారు. మాల్ గోదాం కార్మికుల సంక్షేమం కోసం ప్రత్యేక బోర్డు లేదా కార్పొరేషన్ ఏర్పాటు చేయాలని సంఘం ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తోందని, ఈ లక్ష్యం త్వరలోనే నెరవేరుతుందనే ఆశాభావం వ్యక్తం చేశారు. హైదరాబాద్ బషీర్ బాగ్ ప్రెస్ క్లబ్ లో ఆదివారం బి ఆర్ ఎం జి ఎస్ ఎస్ ఆధ్వర్యంలో కేంద్ర ప్రభుత్వం తీసుకొచ్చిన నాలుగు కార్మిక చట్టాలపై మాల్ గోదాం కార్మికులకు నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడారు. 1998 నుంచి మాల్ గోదాం కార్మికుల హక్కుల సాధన కోసం సంఘం నిరంతరం పోరాటం చేస్తూ కేంద్ర ప్రభుత్వంతో పలు త్రైపాక్షిక సమావేశాలు నిర్వహించిందని తెలిపారు. ఈ క్రమంలో కార్మిక చట్టాల్లో పలు సవరణలు జరిగి, మాల్ గోదాం కార్మికులకు సంక్షేమ ప్రయోజనాలు అందుబాటులోకి వచ్చాయని చెప్పారు.

2024 అక్టోబర్ 9న కేంద్ర కార్మిక శాఖ మంత్రి మన్సుఖ్ మాండవీయ, రైల్వే బోర్డు చైర్మన్ సతీష్ కుమార్, రైల్వే, కార్మిక శాఖల అధికారులు, సంఘం ప్రతినిధులతో జరిగిన సమావేశంలో మాల్ గోదాం కార్మికుల కోసం ప్రత్యేక లేబర్ మేనేజ్ మెంట్ సిస్టమ్ ఏర్పాటు చేయాలని ప్రతిపాదించినట్లు తెలిపారు. దీనిపై ప్రభుత్వం సానుకూలంగా స్పందించి దేశవ్యాప్తంగా మాల్ గోదాంలలో భౌతిక ధృవీకరణ చేపట్టిందన్నారు. ఈ ప్రక్రియలో కార్మికులు, సరుకు రవాణాదారులు ఎదుర్కొంటున్న సమస్యలు, దోపిడీ, మౌలిక వసతుల లోపాలు ప్రభుత్వ దృష్టికి వచ్చాయని పేర్కొన్నారు. కార్మికులకు పీస్రేట్ కూలీని మధ్యవర్తులు లేకుండా నేరుగా వారి బ్యాంకు ఖాతాల్లో జమ చేసే విధానాన్ని అమలు చేయాలని ప్రభుత్వాన్ని కోరారు. విధి నిర్వహ ణలో ప్రమాదాలు జరిగినా, కార్మికుల హక్కులకు భంగం కలిగినా సంఘం అండగా ఉంటుందని, అవసరమైతే ఉద్యమాలకు కూడా వెనుకాడబోమని స్పష్టం చేశారు. కార్మికులు తమ హక్కులపై పూర్తి అవగాహన పెంచుకుని ఐక్యంగా ఉండాలని పిలుపునిచ్చారు. వెస్ట్ సెంట్రల్ రైల్వే జోన్ అధ్యక్షుడు రణవీర్ సింగ్, ఆర్గనైజేషన్ మంత్రి ప్రతీక్ రాథోర్, తెలంగాణ రాష్ట్ర అధ్యక్షుడు జి. అశోక్, ఉపాధ్యక్షుడు బి. మహేశ్వర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

# మల్లంపల్లిలో తీవ్ర తాగునీటి సంక్షోభం....

### • 15 రోజులుగా నీటి ఎద్దడి పాలకుల నిర్లక్ష్యంపై యువ నాయకుడు మహమ్మద్ బాబుల్ ఆగ్రహం



**మల్లంపల్లి, ఆగస్టు 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలోని ప్రధాన గ్రామ పంచాయతీల్లో ఒకటైన జేడీ మల్లంపల్లిలో గత 15 రోజులుగా తీవ్ర తాగునీటి కొరత నెలకొని గ్రామ ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. గ్రామంలోని కెనాల్ సమీపంలో ప్రధాన తాగునీటి పైప్‌లైన్ పగిలిపోవడంతో నీటి సరఫరా పూర్తిగా దెబ్బతిన్నప్పటికీ, ఇప్పటివరకు మరమ్మతులు చేపట్టకపోవడంపై గ్రామస్తులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఈ సమస్యపై యువ నాయకుడు మహమ్మద్ బాబుల్ తీవ్రంగా స్పందిస్తూ అధికారుల, పాలకవర్గం నిర్లక్ష్య వైఖరిని తప్పుబట్టారు. పగిలిన పైప్‌లైన్ నుంచి భారీగా నీరు వృథాగా పోతుండగా, మరోవైపు గ్రామంలోని కుటుంబాలకు కనీసం తాగునీరు కూడా అందక ప్రజలు అవస్థలు పడుతున్నారని ఆయన పేర్కొన్నారు. కళ్లెదుటే నీరు లీకవుతున్నా సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులు స్పందించకపోవడం దురదృష్టకరమని, మేజర్ గ్రామ పంచాయతీ ప్రజలకు కనీస తాగునీటి సౌకర్యం కల్పించడంలో పాలకవర్గం పూర్తిగా విఫలమైందని మహమ్మద్ బాబుల్ విమర్శించారు. ఇప్పటికైనా అధికారులు వెంటనే స్పందించి కెనాల్ సమీపంలోని పగిలిన పైప్‌లైన్‌కు యుద్ధ ప్రాతిపదికన మరమ్మతులు చేపట్టి గ్రామానికి తాగునీటి సరఫరాను పునరుద్ధరించాలని ఆయన డిమాండ్ చేశారు. లేనిపక్షంలో గ్రామ ప్రజలను సమీకరించి గ్రామ పంచాయతీ కార్యాలయం ఎదుట పెద్దఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపడతామని హెచ్చరించారు.

# ప్రభుత్వ బడులను కాపాడుకుందాం

### భవిష్యత్ తరాలను నిలబెట్టుకుందాం..!

### ప్రైవేట్ మోజుతో వెలవెలబోతున్న గ్రామీణ పాఠశాలలు

### పూర్వవైభవం కోసం ప్రజలంతా కలిసిరావాల్సిన సమయం

### తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, ప్రజాప్రతినిధులు, అధికారులు బాధ్యత తీసుకోవాలని మేధావుల పిలుపు









**కల్లూరు, ఆగస్టు 2 (పిసిడబ్ల్యూ న్యూస్) :** ఒకప్పుడు గ్రామాల్లో ప్రభుత్వ పాఠశాలలు విద్యార్థుల సందడితో కళకళలాడేవి. ప్రభుత్వ బడిలో చదవడం గర్వకారణంగా భావించేవారు. ఆ పాఠశాలల్లో చదివిన వేలాది మంది నేడు వైద్యులు, ఇంజినీర్లు, ఉపాధ్యాయులు, ప్రభుత్వ అధికారులు, వ్యాపారవేత్తలుగా దేశవ్యాప్తంగా రాణిస్తున్నారు. కానీ నేడు అదే ప్రభుత్వ విద్యా వ్యవస్థ విద్యార్థుల కొరతతో తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటోంది. ముఖ్యంగా కల్లూరు మండలంలోని పలు ప్రభుత్వ ప్రాథమిక పాఠశాలలు మూతపడే పరిస్థితికి చేరుకోవడం ఆందోళన కలిగిస్తోంది. విద్యా రంగంలో ప్రభుత్వం కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తూ ఉచిత పాఠ్యపుస్తకాలు, యూనిఫాంలు, మధ్యాహ్న భోజనం, డిజిటల్ విద్య, మౌలిక వసతులు వంటి అనేక సౌకర్యాలు కల్పిస్తున్నప్పటికీ ఆశించిన స్థాయిలో విద్యార్థుల చేరికలు పెరగడం లేదు. తల్లిదండ్రులు ప్రైవేట్ విద్యపైనే ఎక్కువగా మొగ్గు చూపుతుండటంతో ప్రభుత్వ పాఠశాలలు క్రమంగా వెలవెలబోతున్నాయి. మరోవైపు, ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేసే కొందరు ఉపాధ్యాయులు, ఇతర ప్రభుత్వ ఉద్యోగులు సైతం తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో కాకుండా ప్రైవేట్ విద్యాసంస్థల్లో చేర్పించడం సమాజంలో అనేక సందేహాలకు తావిస్తోంది. ప్రభుత్వ బడిలో బోధించే విద్యపై వారికే నమ్మకం లేకపోతే సాధారణ ప్రజలకు ఎలా నమ్మకం కలుగుతుంది, అనే ప్రశ్నలు వ్యక్తమవుతున్నాయి. అయితే, కొందరు జిల్లా కలెక్టర్లు, ఉన్నతాధికారులు తమ పిల్లలను ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తూ సమాజానికి ఆదర్శంగా నిలిచిన సందర్భాలు ఉన్నాయి. అలాంటి స్ఫూర్తిదాయక చర్యలు ప్రజల్లో ప్రభుత్వ విద్యపై విశ్వాసాన్ని పెంచగలవని విద్యావేత్తలు అభిప్రాయపడుతున్నారు. ప్రభుత్వ పాఠశాలల పూర్వ వైభవం తిరిగి రావాలంటే ప్రభుత్వం ఒక్కటే కాదు... గ్రామ ప్రజలు, పూర్వ విద్యార్థులు, యువత, తల్లిదండ్రులు, ప్రజాప్రతినిధులు, గ్రామ పాలకులు, ఉపాధ్యాయులు అందరూ బాధ్యత తీసుకోవాల్సిన అవసరం ఉందని మేధావులు సూచిస్తున్నారు. ప్రతి గ్రామంలో ప్రభుత్వ పాఠశాలల ప్రాముఖ్యతపై అవగాహన కార్యక్రమాలు నిర్వహించి, ప్రభుత్వం అందిస్తున్న సౌకర్యాలు, ప్రభుత్వ బడిలో చదివి ఉన్నత స్థాయికి చేరుకున్న వారి విజయగాథలను ప్రజలకు చేరవేయాల్సిన అవసరం ఉందని పేర్కొంటున్నారు. అలాగే ప్రభుత్వ సంక్షేమ పథకాలలో కొన్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివే విద్యార్థులకు ప్రాధాన్యత ఇచ్చే విధంగా విధానపరమైన నిర్ణయాలు తీసుకుంటే ప్రభుత్వ పాఠశాలల వైపు తల్లిదండ్రుల ఆసక్తి పెరిగే అవకాశం ఉందని అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ప్రభుత్వ పాఠశాలలు కేవలం విద్యాసంస్థలు మాత్రమే కావు,, అవి గ్రామీణ సమాజ అభివృద్ధికి పునాదులు. ఇవి బలహీనపడితే గ్రామీణ విద్యా వ్యవస్థ దెబ్బతింటుంది. అందువల్ల కల్లూరు మండలంతో పాటు రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను పరిరక్షించడం ప్రతి ఒక్కరి సామాజిక బాధ్యతగా భావించి సమిష్టిగా ముందుకు రావాల్సిన అవసరం ఎంతైనా ఉందని విద్యావేత్తలు, సామాజికవేత్తలు, మేధావులు పిలుపునిస్తున్నారు.

**ప్రభుత్వ బడి బలపడితేనే సమాన విద్య సాధ్యం**

ప్రభుత్వ పాఠశాల బలపడటం అంటే గ్రామ భవిష్యత్తు బలపడటమే. ఒక ప్రభుత్వ బడి మూతపడటం అంటే ఒక గ్రామ విద్యా చరిత్రలో ఒక అధ్యాయం ముగిసినట్టేనని విద్యావేత్తలు హెచ్చరిస్తున్నారు.

# రాజు రాథోడ్‌కు ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ అవార్డు




**హైదరాబాద్, ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** ప్రతిష్టాత్మకమైన ఇంటర్నేషనల్ మార్షల్ ఆర్ట్స్ మాస్టర్స్ అవార్డు - 2026నుకాచిగూడ లోని ఎంఎస్ఎస్ లా కాలేజీలో లా ఫైనల్ ఇయర్ చదువుతున్న విద్యార్థి రాజు రాథోడ్ అందుకున్నారు. హైదరాబాద్ లక్ష్మీ గార్డెన్స్ లో ఆదివారం నిర్వహించిన కార్యక్రమంలో రాజు రాథోడ్ కు ప్రముఖ మార్షల్ ఆర్ట్స్ గురువులు డాక్టర్ వి.రవి మాస్టర్, తెలంగాణ షి టీమ్ టెక్నికల్ హెడ్ లక్ష్మీ, మద్ది కన్నన్ గౌడ్ మాస్టర్ లు అందజేశారు. ఈ సందర్భంగా మార్షల్ ఆర్ట్స్ సంఘాల గ్రాండ్ మాస్టర్లు, సీనియర్ మాస్టర్లు, కోచ్ లు, ప్రముఖులు రాజు రాథోడ్ ను ఘనంగా సన్మానించి అభినందించారు. అలాగే ఇటీవల గిన్నిస్ వరల్డ్ రికార్డ్ సాధించి దేశానికి, తెలంగాణ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచినందుకు గుర్తింపుగా ఈ అత్యున్నత గౌరవాన్ని ప్రదానం చేశారు. భవిష్యత్తులో మరిన్ని జాతీయ, అంతర్జాతీయ విజయాలు సాధించాలని వారు ఆకాంక్షించారు. ఈ అవార్డు రాజు రాథోడ్ గారి నిరంతర కృషికి, అంకితభావానికి, మార్షల్ ఆర్ట్స్ పట్ల ఉన్న నిబద్ధతకు లభించిన మరో అరుదైన గౌరవంగా నిలిచింది.

# ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలు విడుదల చేయాలి: సీఎం వ్యాఖ్యలపై బీజేపీ యువ మోర్చా ఆగ్రహం



**కరీంనగర్, ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):** రాష్ట్రంలోని సుమారు 30 లక్షల మంది విద్యార్థులకు రావాల్సిన రూ.15,000 కోట్ల ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను విడుదల చేయాలని డిమాండ్ చేస్తున్న విద్యార్థులను "క్రిమినల్ వేస్ట్"గా అభివర్ణించడం ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి అహంకారానికి నిదర్శనమని బీజేపీ యువ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు నరెడ్ల ప్రవీణ్ రెడ్డి విమర్శించారు.ఆదివారం కరీంనగర్‌లో విడుదల చేసిన ప్రకటనలో ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు తమ హక్కులను కోరితే అవమానించడం కాకుండా వారికి న్యాయం చేయడం ప్రభుత్వ బాధ్యత అని అన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం తన వైఫల్యాలను కప్పిపుచ్చుకునేందుకు విద్యార్థులనే నిందిస్తోందని ఆరోపించారు.రెండున్నరేళ్లుగా విద్యాశాఖ ముఖ్యమంత్రి వద్దే ఉన్నప్పటికీ విద్యా రంగంలో తీసుకొచ్చిన సంస్కరణలు ఏమిటని ప్రశ్నించారు. ప్రభుత్వ పాఠశాలల బలోపేతం, విశ్వవిద్యాలయాల్లో ఖాళీల భర్తీ, ఫీజు రీయింబర్స్‌మెంట్ బకాయిల చెల్లింపు, స్కాలర్‌షిప్‌ల విడుదల, నిరుద్యోగ యువతకు ఉద్యోగాల కల్పన వంటి అంశాల్లో ప్రభుత్వం విఫలమైందని విమర్శించారు.సమస్యలను పరిష్కరించకుండా ప్రశ్నించే విద్యార్థులను "క్రిమినల్ వేస్ట్"గా ముద్ర వేయడం కాంగ్రెస్ ప్రభుత్వ అసహన వైఖరికి నిదర్శనమని పేర్కొన్నారు. ముఖ్యమంత్రి వెంటనే ఆ వ్యాఖ్యలను ఉపసంహరించుకుని రాష్ట్ర విద్యార్థులకు బేషరతుగా క్షమాపణ చెప్పాలని, పెండింగ్‌లో ఉన్న ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్ బకాయిలను వెంటనే విడుదల చేయాలని డిమాండ్ చేశారు.లేనిపక్షంలో రాష్ట్రవ్యాప్తంగా విద్యార్థులతో కలిసి బీజేపీ యువ మోర్చా ఆధ్వర్యంలో ఆందోళనలు చేపడతామని నరెడ్ల ప్రవీణ్ రెడ్డి హెచ్చరించారు.

# చింతకుంట మడేలేశ్వర స్వామి దేవాలయంలో నూతన బోర్ ప్రారంభించిన నగర మేయర్ కొలగాని శ్రీనివాస్



**చింతకుంట ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని చింతకుంట మడేలేశ్వర స్వామి దేవాలయం ప్రాంగణంలో నూతనంగా ఏర్పాటు చేసిన బోర్‌ను నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ కొబ్బరికాయ కొట్టి ప్రారంభించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ, దేవాలయానికి వచ్చే భక్తులకు తాగునీటి సౌకర్యం మెరుగుపడేలా ఈ బోర్ ఏర్పాటు చేయడం సంతోషకరమని అన్నారు. ప్రజలకు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు నగరపాలక సంస్థ నిరంతరం కృషి చేస్తోందని తెలిపారు.ఈ కార్యక్రమంలో స్థానిక కార్పొరేటర్ గడ్డి ప్రదీప్, గాజ శివరాం రాచకొండ కిట్టు, భూక్య తిరుపతి నాయక్, గంగాధర శ్రీనివాస్, రాచకొండ కొమురయ్య, పూసల సంపత్ ,జుట్ట వేణి రేణు, గుంజేటి శివకుమార్, రాచకొండ శ్రీనివాస్ ,రజక సంఘం నాయకులు మరియు కులస్తులు పాల్గొన్నారు

# 24వ డివిజన్‌లో రూ.50 లక్షల UIDF నిధులతో సీసీ రోడ్డు, సీసీ డ్రైన్ పనులకు శంకుస్థాపన

- చేసిన కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్





**కరీంనగర్ ఆగస్టు 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరపాలక సంస్థ అభివృద్ధి కార్యక్రమాల్లో భాగంగా నగరంలోని 24వ డివిజన్‌లోని గుండు హనుమాన్ టెంపుల్ సమీపంలో రూ.50 లక్షల UIDF నిధులతో చేపట్టనున్న సీసీ రోడ్డు మరియు సీసీ డ్రైన్ నిర్మాణ పనులకు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి, కరీంనగర్ పార్లమెంట్ సభ్యులు బండి సంజయ్ కుమార్, నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ తో కలిసి శంకుస్థాపన చేశారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ, నగరంలోని ప్రతి డివిజన్‌లో మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తున్నామని తెలిపారు. ప్రజలకు మెరుగైన రహదారులు, డ్రైనేజీ వ్యవస్థ అందుబాటులోకి తీసుకురావడానికి ప్రభుత్వం ప్రత్యేక నిధులతో అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. నగర అభివృద్ధికి అవసరమైన అన్ని చర్యలను సమన్వయంతో ముందుకు తీసుకెళ్తామని పేర్కొన్నారు.ఈ కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వై. సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణ రెడ్డి గారు, జిల్లా అధ్యక్షులు గంగాడి కృష్ణారెడ్డి, కార్పొరేటర్లు, మున్సిపల్ అధికారులు, స్థానిక ప్రజాప్రతినిధులు, కాలనీవాసులు, మహిళలు తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్‌లో తెలంగాణకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్

**హైదరాబాద్ ఆగస్టు 02(పిసిడబ్ల్యూ న్యూస్):** బెంగళూరులో నిర్వహించిన 15వ షోటోఖాన్ జాతీయ కరాటే ఛాంపియన్‌షిప్2026లో తెలంగాణ రాష్ట్రానికి చెందిన జీవీఆర్ కరాటే అకాడమీ విద్యార్థులు అద్భుత ప్రతిభ కనబరిచి ఓవరాల్ ఛాంపియన్‌షిప్ ను కైవసం చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో ఆర్గనైజర్ మునీర్ పాషా ఓడరియో కరాటే చీఫ్ రాజశేఖరన్ ట్రోఫీని జివిఆర్ కరాటే అకాడమీ డైరెక్టర్ డాక్టర్ జి ఎస్ గోపాల్ రెడ్డికి అందజేశారుఈ పోటీలలో అకాడమీ నుంచి 24 మంది విద్యార్థులు కటా, కుమితే విభాగాల్లో పాల్గొని అత్యుత్తమ ప్రదర్శన కనబరిచారు. కటా విభాగంలో 15 బంగారు పతకాలు, 9 రజత పతకాలు, కుమితే విభాగంలో 23 బంగారు పతకాలు, 1 రజత పతకం సాధించారు. మొత్తంగా 38 బంగారు పతకాలు, 10 రజత పతకాలు గెలుచుకుని తెలంగాణ రాష్ట్రానికి, జీవీఆర్ కరాటే అకాడమీకి జాతీయ స్థాయిలో మరోసారి ఘన విజయాన్ని అందించారని అకాడమీ డైరెక్టర్ డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి తెలిపారు.పాల్గొన్న విద్యార్థుల వివరాలు+21 సంవత్సరాల బ్లాక్ సీనియర్ బాలికల బెల్ట్ కేటగిరీలోజి. అమృత రెడ్డి కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-19 సంవత్సరాల సీనియర్ బాలికల బ్లాక్ బెల్ట్ కేటగిరీలోజి. గన సంతోషిని రెడ్డి కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-17 సంవత్సరాల బ్లాక్ బెల్ట్ -70 కేజీల బాలికల క్యాటగిరిద్వైత కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-17 సంవత్సరాల బ్లాక్ బెల్ట్ -60 కేజీల బాలికల కేటగిరిలోఅనగ కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-17 సంవత్సరాల బ్లాక్ బెల్ట్ -55 కేజీల బాలికలకేటగిరిలోమహిమా విశాల్ పటేల్ కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-16 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -75 కేజీల బాలికలకేటగిరిలోగౌతమి కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-16 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -60 కేజీల బాలికలకేటగిరిలోశ్రీత కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-16 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -30 కేజీల బాలికలకేటగిరిలోఅక్షిణి కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-14 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -60 కేజీల బాలికలకేటగిరిలోశివాని కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-14 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -35కేజీల బాలికల కేటగిరిలోమౌక్తిక కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-17 సంవత్సరాల కలర్ బెల్ట్ -75 కేజీల బాలికలకేటగిరిలోమకాడియా శ్రేయ కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-16 సంవత్సరాల కలర్ బెల్ట్ -50 కేజీల బాలికలకేటగిరిలోజునైరా కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-14 సంవత్సరాల కలర్ బెల్ట్ -40 కేజీల బాలికలకేటగిరిలో బొల్లం చిన్మయి ప్రియ కటా: బంగారు పతకం,- కుమితే: బంగారు పతకం-17 సంవత్సరాల బ్లాక్ బెల్ట్ బాలుర -65 కేటగిరిలోజి. అవిగ్న వెంకట్ రెడ్డి కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-16 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -65 కేజీల బాలురకేటగిరిలోఒలకుంటి




జాన్ ప్రీతం కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-16 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -50 కేజీల బాలురకేటగిరిలోలక్ష్మి నరసింహ కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-14 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -55 కేజీల బాలురకేటగిరిలో వన్ష్ కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-14 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -50 కేజీల బాలురకేటగిరిలోపృథ్వీరాజ్ పింజారా కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-14 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -45 కేజీల బాలురకేటగిరిలోరఘురామ్ కటా: రజత పతకం, కుమితే: రజత పతకం-14 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -40 కేజీల బాలురకేటగిరిలోలాకాకుల అన్విత్ పటేల్ కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-12 సంవత్సరాల బ్రౌన్ బెల్ట్ -40 కేజీల బాలురకేటగిరిలోభార్గవ్ కటా: రజత పతకం, కుమితే: బంగారు పతకం-16 సంవత్సరాల కలర్ బెల్ట్ -50 కేజీల బాలురకేటగిరిలోఎం. ఆకాశ్ చౌహాన్ కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-14 సంవత్సరాల కలర్ బెల్ట్ -65 కేజీల బాలురకేటగిరిలోఆరవ్ కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకం-14 సంవత్సరాల కలర్ బెల్ట్ -40 కేజీల బాలురకేటగిరిలో సహర్ష్ కటా: బంగారు పతకం, కుమితే: బంగారు పతకంజాతీయ స్థాయిలో తెలంగాణకు ఓవరాల్ ఛాంపియన్‌షిప్ సాధించిన అన్ని క్రీడాకారులను అకాడమీ డైరెక్టర్ డా. జి.ఎస్. గోపాల్ రెడ్డి, కోచ్‌లు మరియు తల్లిదండ్రులు అభినందించారు. భవిష్యత్తులో అంతర్జాతీయ స్థాయిలోనూ మరిన్ని విజయాలు సాధించి తెలంగాణకు, దేశానికి మరింత కీర్తి తీసుకురావాలని ఆకాంక్షించారు.

# కరీంనగర్ అభివృద్ధిపైనే నా దృష్టి

## కేంద్రం నుండి మరిన్ని నిధులు రాబట్టేందుకు యత్నిస్తున్నా

## తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీక బోనాలు


## కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

## మేయర్, డిప్యూటీ మేయర్‌తో కలిసి కరీంనగర్ 24వ డివిజన్ లో అభివృద్ధి పనులకు శంకుస్థాపన



**కరీంనగర్ ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):** అభివృద్ధిలో కరీంనగర్ కార్పొరేషన్ ను రాష్ట్రంలోనే అగ్రగామిగా నిలబెట్టాలన్న దానిపైనే దృష్టిని కేంద్రీకరించినట్లు కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తెలిపారు. అందులో భాగంగా ప్రధానమంత్రి నరేంద్రమోదీ నాయకత్వంలోని కేంద్రం నుండి పెద్ద ఎత్తున నిధులు తీసుకువచ్చేందుకు ప్రయత్నిస్తున్నట్లు పేర్కొన్నారు. ఈరోజు కరీంనగర్ లోని 24వ డివిజన్ లోని బ్యాంక్ కాలనీలో రూ.50 లక్షల విలువైన యూఐడీఎఫ్ నిధులతో చేపట్టిన సీసీ రోడ్డు, డ్రెయిన్ పనులకు కరీంనగర్ మేయర్ కొలగాని శ్రీనివాస్, డిప్యూటీ మేయర్ సునీల్ రావు, స్థానిక కార్పొరేటర్ ఒంటెల సత్యనారాయణరెడ్డితో కలిసి కేంద్ర మంత్రి బండి సంజయ్ కుమార్ శంకుస్థాపన చేశారు. అక్కడి నుండి కిసాన్ నగర్ వెళ్లిన బండి సంజయ్ పోచమ్మ ఆలయంలో పూజలు నిర్వహించారు. మున్నూరుకాపు సంఘం ఆధ్వర్యంలో నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో పాల్గొన్నారు. అనంతరం మీడియాకు ఒక ప్రకటన విడుదల చేశారు.బోనాలంటేనే భక్తి, వీరత్వానికి ప్రతీక. బోనాలంటే కేవలం ఒక జాతర కాదు. తెలంగాణ సంస్కృతికి జీవం, భక్తి-శక్తి-సంప్రదాయాల కలయిక. లక్షలాది భక్తుల విశ్వాసానికి ప్రతీక. ప్రతి ఏటా ఆషాఢ మాసంలో జరిగే ఈ ఉత్సవాలు కరీంనగర్ ను ఆధ్యాత్మిక సాగరంలో ముంచెత్తుతాయి.అసలు బోనాలు అంటేనే తెలంగాణ సంస్కృతికి ప్రతీక. బోనాలంటేనే తెలంగాణ ఆత్మగౌరవం. బోనాలంటేనే... జానపద కళల పండుగ. బోనాలంటేనే... కుటుంబాల కలయిక. బోనాలంటేనే...మహిళా శక్తికి ప్రతీక. బోనాలంటేనే ... ఎంతగా కార్పొరేటీకరణ జరిగినా పట్టణ, గ్రామీణ సంప్రదాయాలను సంరక్షించుకునే మహోత్సవం. బోనాలంటేనే భక్తి, సంస్కృతి, సాహసాల సమ్మేళనం. ఒక్క మాటలో చెప్పాలంటే...."బోనం అనేది కుండలో వండిన అన్నం మాత్రమే కాదు... తల్లి పట్ల బిడ్డకు ఉన్న అపారమైన ప్రేమ. పోతురాజు నృత్యం కేవలం వినోదం కాదు... మన ఊరిని, వీధిని కాపాడే వీరత్వానికి చిహ్నం. ఇంత గొప్ప విశిష్టత ఉన్న బోనాల ఉత్సవాలను భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని కోరుతున్నామని చెప్పారు.

# కిసాన్ నగర్, శ్రీపురం కాలనీ, చింతకుంట, హనుమాన్ నగర్ బోనాల ఉత్సవాల్లో పాల్గొన్న మేయర్ కొలగాని శ్రీనివాస్..





**కరీంనగర్ ఆగస్టు 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** కరీంనగర్ నగరంలోని కిసాన్ నగర్, శ్రీపురం కాలనీ, చింతకుంట, హనుమాన్ నగర్ ప్రాంతాల్లో ఘనంగా నిర్వహించిన బోనాల ఉత్సవాల్లో నగర మేయర్ కొలగాని శ్రీనివాస్ పాల్గొన్నారు.ఈ సందర్భంగా ఆయా దేవాలయాలను సందర్శించి అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం సంప్రదాయబద్ధంగా బోనమెత్తి అమ్మవారికి మొక్కులు తీర్చుకున్నారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే బోనాల పండుగను భక్తిశ్రద్ధలతో జరుపుకోవడం ఆనందదాయకమని అన్నారు. నగర ప్రజలందరూ సుఖసంతోషాలతో, ఆయురారోగ్యాలతో ఉండాలని అమ్మవారిని ప్రార్థించినట్లు తెలిపారు.ఈ కార్యక్రమాల్లో కార్పొరేటర్లు,ఏపీపీ చంద్ర, సోమిడి వేణు, గాదె రూప, విప్పల సాయి జ్యోతి, గాజ రమ శివరాం, బారి అపర్ణ జితేందర్, ప్రజాప్రతినిధులు, దేవాలయ కమిటీ సభ్యులు, నాయకులు, మహిళలు, భక్తులు, స్థానిక ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# ఎరువులకు లింకులు.. అన్నదాతకు తిప్పలు..!

## లింక్ లేకుంటే బస్తాలు లేవంటున్న గ్రోమోర్ సెంటర్లు ఎమ్మార్పీ కంటే అధిక వసూళ్లపై రైతుల ఆగ్రహం

**మల్లంపల్లి మండల ప్రతినిధి , ఆగస్టు 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** ములుగు జిల్లాలో ఖరీఫ్ సాగు జోరందుకోవడంతో ఎరువుల కోసం గ్రోమోర్ సెంటర్లు, ఫర్టిలైజర్ దుకాణాలకు వెళ్తున్న రైతులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. అవసరమైన కాంప్లెక్స్ ఎరువులు కొనుగోలు చేయాలంటే వాటితో పాటు పురుగుమందులు, సూక్ష్మపోషకాలు, గ్రోత్ ప్రమోటర్లు లేదా ఇతర వ్యవసాయ ఉత్పత్తులు కూడా తప్పనిసరిగా కొనుగోలు చేయాలని కొందరు డీలర్లు ఒత్తిడి తెస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అదనపు ఉత్పత్తులు కొనుగోలు చేయడానికి నిరాకరిస్తే ఎరువులు ఇవ్వకపోవడం లేదా ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ కంటే ఎక్కువ ధర వసూలు చేస్తున్నారని వాపోతున్నారు. ఇప్పటికే సాగు ఖర్చులు, అప్పుల భారంతో ఇబ్బందులు పడుతున్న చిన్న, సన్నకారు రైతులకు ఈ పరిస్థితి మరింత భారంగా మారిందని రైతు సంఘాలు ఆందోళన వ్యక్తం చేస్తున్నాయి. **'లింక్' లేకుంటే ఎరువులే లేవా..?** జిల్లాలోని పలు ప్రాంతాల్లో రైతులు కోరిన ఎరువులు మాత్రమే ఇవ్వకుండా వాటితో పాటు ఇతర ఉత్పత్తులు కొనుగోలు చేస్తేనే బస్తాలు ఇస్తామని షరతులు విధిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. అవసరం లేకపోయినా అదనపు వస్తువులు కొనాల్సి రావడంతో ఒక్కో రైతుపై వందల నుంచి వేల రూపాయల వరకు అదనపు భారం పడుతోందని చెబుతున్నారు. రైతుల అవసరాన్ని ఆసరాగా చేసుకుని "లింక్ సేల్స్" పేరుతో వ్యాపారం చేస్తున్నారని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. **ఎమ్మార్పీపై అదనపు వసూళ్లు** లింక్ ఉత్పత్తులు కొనుగోలు చేయని రైతుల నుంచి ఒక్కో ఎరువుల బస్తాకు ఎమ్మార్పీ కంటే రూ.100 వరకు అదనంగా వసూలు చేస్తున్నారనే ఆరోపణలు వినిపిస్తున్నాయి. బిల్లుల్లో పూర్తి వివరాలు నమోదు చేయకుండా, ధరలపై ప్రశ్నిస్తే ఎరువులు ఇవ్వబోమని బెదిరిస్తున్నారని రైతులు ఆరోపిస్తున్నారు. యూరియా కోసం ప్రభుత్వం ప్రవేశపెట్టిన యాప్ ద్వారా బుకింగ్ చేసుకున్న తర్వాత కూడా గ్రోమోర్ సెంటర్‌కు వెళ్లినప్పుడు లింక్ ఉత్పత్తులు కొనుగోలు చేయాల్సిందేనని షరతులు విధిస్తున్నారని తెలిపారు. **అప్పు రైతుకు మరింత భారం** జిల్లాలో అధిక శాతం రైతులు పంట కోత అనంతరం చెల్లించే విధానంలో ఎరువులు, విత్తనాలు, పురుగుమందులు కొనుగోలు చేస్తున్నారు. ఇప్పటికే పెరిగిన పెట్టుబడులు, వడ్డీ భారం మధ్య బలవంతపు లింక్ విక్రయాలు రైతులపై మరింత ఆర్థిక ఒత్తిడిని పెంచుతున్నాయని రైతు సంఘాలు పేర్కొంటున్నాయి. పంట దిగుబడులపై అనిశ్చితి నెలకొన్న సమయంలో ఈ అదనపు ఖర్చులు రైతులను మరింత సంక్షోభంలోకి నెడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

**తనిఖీలు ఎక్కడ..?** జిల్లాలో ఎరువుల దుకాణాలు, గ్రోమోర్ సెంటర్లలో జరుగుతున్న ఈ వ్యవహారంపై వ్యవసాయ శాఖ అధికారులు ప్రత్యేక తనిఖీలు నిర్వహించడం లేదనే విమర్శలు వ్యక్తమవుతున్నాయి. లింక్ విక్రయాలు, ఎమ్మార్పీ కంటే అధిక ధరల వసూళ్లపై సమగ్ర విచారణ చేపట్టి, నిబంధనలు ఉల్లంఘించిన డీలర్లపై కఠిన చర్యలు తీసుకోవాలని రైతులు డిమాండ్ చేస్తున్నారు. జిల్లా కలెక్టర్ స్వయంగా జోక్యం చేసుకుని ప్రభుత్వం నిర్ణయించిన ఎమ్మార్పీ ధరలకే రైతులకు ఎరువులు అందేలా చర్యలు తీసుకోవాలని కోరుతున్నారు.



### కఠిన చర్యలు తీసుకోవాలి

- " కొండం రవీందర్ రెడ్డి, ములుగు ఆత్మ కమిటీ చైర్మన్

ఎరువులతో పాటు ఇతర ఉత్పత్తులు బలవంతంగా కొనిపించడం పూర్తిగా నిబంధనలకు విరుద్ధమని ములుగు ఆత్మ కమిటీ చైర్మన్ కొండం రవీందర్ రెడ్డి అన్నారు. జిల్లా వ్యవసాయ శాఖ ప్రత్యేక బృందాలతో తనిఖీలు నిర్వహించి బాధ్యులపై చర్యలు తీసుకోవాలని, ఎమ్మార్పీ కంటే అధిక ధరలకు విక్రయాలు చేయడం, లింక్ సేల్స్‌కు పాల్పడుతున్న వ్యాపారులపై కఠిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

# స్నేహాన్ని శాశ్వతం చేసిన 'లెజెండ్ ట్రోఫీ'

- నాలుగు మండలాల క్రీడాకారులను ఒక్కటి చేసిన 'ఫ్రెండ్షిప్ డే' క్రికెట్ సంబరం
- 35 ఏళ్లు దాటిన క్రీడాకారులతో వినూత్న టోర్నమెంట్..
- తిమ్మారావుపేట పూర్వ విద్యార్థులు సుధాకర్ రావు, రాంబాబు రాథోడ్ సృజనాత్మక ఆలోచనకు ప్రశంసల వెల్లువ..
- విజేతగా తల్లాడ, రన్నరప్‌గా ఏనుకూరు





**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 2 (పిసిడబ్ల్యూ న్యూస్):** స్నేహం అంటే కేవలం పలకరింపులు కాదు.. జీవితాంతం ఒకరికి ఒకరు అండగా నిలిచే అనుబంధం. ఆ అనుబంధాన్ని మరింత బలపరిచే వేదికగా నిలిచింది ఫ్రెండ్షిప్ డే సందర్భంగా నిర్వహించిన 'లెజెండ్ ట్రోఫీ' నాలుగు మండలాల స్థాయి క్రికెట్ టోర్నమెంట్. 35 సంవత్సరాలు దాటిన క్రీడాకారులను ఒకే మైదానంపైకి తీసుకొచ్చి పోటీ కంటే స్నేహానికే పెద్దపీట వేస్తూ నిర్వహించిన ఈ వినూత్న క్రీడా వేడుక ఆదివారం ఖమ్మం వైయస్సార్ నగర్ స్టేడియంలో హృద్యంగా ముగిసింది. ఈ టోర్నమెంట్‌లో తల్లాడ మండలం జట్టు అద్భుత ప్రదర్శనతో విజేతగా నిలవగా, ఏనుకూరు మండలం జట్టు ద్వితీయ స్థానాన్ని కైవసం చేసుకుంది. కామేపల్లి, కారేపల్లి మండలాల జట్లు కూడా ఉత్సాహంగా పోటీపడి క్రీడాస్ఫూర్తిని చాటాయి. విజేతలకు ప్రముఖ తెలంగాణ ఉద్యమకారులు, ప్రభుత్వ వైద్యులు డాక్టర్ దశరథ్ బహుమతులు అందజేసి అభినందించారు. ఈ సందర్భంగా డాక్టర్ దశరథ్ మాట్లాడుతూ... "స్నేహానికి వయస్సుతో సంబంధం లేదు. కులం, మతం, ప్రాంతం, ఆర్థిక స్థితి అనే భేదాలకు అతీతంగా జీవితాంతం నిలిచే బంధమే స్నేహం అన్నారు. అలాంటి స్నేహాన్ని క్రీడల ద్వారా మరింత బలోపేతం చేయడం గొప్ప ఆలోచన" అని పేర్కొన్నారు. తల్లాడ, ఏన్కూరు, కారేపల్లి, కామేపల్లి నాలుగు మండలాలకు చెందిన క్రీడాకారులను ఒకే వేదికపై కలిపి శాశ్వత స్నేహితులుగా మార్చిన ఈ కార్యక్రమం ఆదర్శప్రాయమని కొనియాడారు. ఈ విజయవంతమైన టోర్నమెంట్ వెనుక తిమ్మారావుపేట పూర్వ విద్యార్థులు సుధాకర్ రావు, రాంబాబు రాథోడ్ల సృజనాత్మక ఆలోచన ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. ఫ్రెండ్షిప్ డేను వినూత్నంగా జరుపుకోవాలనే సంకల్పంతో దాదాపు పది రోజుల ముందుగానే ప్రణాళిక రూపొందించి, 35 ఏళ్లు దాటిన మాజీ క్రీడాకారులకు మాత్రమే అవకాశం కల్పిస్తూ 'లెజెండ్ ట్రోఫీ'ని నిర్వహించడం అందరి ప్రశంసలు అందుకుంది. విజయం కోసం మాత్రమే కాకుండా, పాత స్నేహాలను పునరుద్ధరించుకోవడం, కొత్త అనుబంధాలను ఏర్పరచుకోవడం, క్రీడల ద్వారా ఆరోగ్యాన్ని, ఆత్మీయతను పెంపొందించడం ఈ టోర్నమెంట్ ప్రధాన ఉద్దేశ్యంగా నిలిచింది. ఎన్నో ఏళ్ల తర్వాత ఒకే మైదానంలో కలుసుకున్న క్రీడాకారులు పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటూ ఆనందాన్ని పంచుకోవడం అందరినీ భావోద్వేగానికి గురిచేసింది. ఈ సందర్భంగా నిర్వాహకులు సుధాకర్ రావు, రాంబాబు రాథోడ్‌ల సేవలను పలువురు ప్రత్యేకంగా అభినందించారు. స్నేహితుల దినోత్సవాన్ని కేవలం శుభాకాంక్షలకే పరిమితం చేయకుండా, జీవితాంతం గుర్తుండిపోయే మధుర జ్ఞాపకంగా మార్చిన ఈ వినూత్న కార్యక్రమం ప్రతి ఏటా కొనసాగాలని క్రీడాకారులు ఆకాంక్షించారు. క్రీడాస్ఫూర్తి, స్నేహబంధం, సామాజిక ఐక్యత ఒకే వేదికపై ఆవిష్కృతమైన ఈ 'లెజెండ్ ట్రోఫీ' టోర్నమెంట్.. ఫ్రెండ్షిప్ డేకు నిజమైన అర్థాన్ని చాటుతూ నాలుగు మండలాల క్రీడాకారుల హృదయాల్లో చిరస్థాయిగా నిలిచిపోయింది.

# 31 ఏళ్ల నిష్కళంక సేవకు గౌరవ వందనం

- ఖజానా శాఖకు ఆదర్శంగా నిలిచిన వెంటపల్లి సత్యనారాయణకు ఘన వీడ్కోలు
- సుదీర్ఘ ప్రయాణానికి సువర్ణ ముగింపు
- 'ప్రజాధన పరిరక్షణే పరమ ధర్మం' అనే స్ఫూర్తితో సేవలు..
- సహోద్యోగుల కన్నీటి వీడ్కోలు మధ్య ఉద్యోగ విరమణ సన్మానం






**ఖమ్మం ప్రతినిధి, ఆగస్టు 2 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఉద్యోగం అనేది కేవలం జీవనోపాధి మాత్రమే కాదు.. సమాజానికి, ప్రభుత్వానికి నిజాయితీతో చేసే సేవ అని తన 31 ఏళ్ల సుదీర్ఘ ఉద్యోగ జీవితంతో నిరూపించిన జిల్లా ట్రెజరీ అధికారి వెంటపల్లి సత్యనారాయణకు మహబూబాబాద్‌లో ఖజానా, అకౌంట్స్ శాఖ అధికారులు, ఉద్యోగులు, గెజిటెడ్ అధికారులు, పెన్షనర్ల సమక్షంలో హృదయాన్ని హత్తుకునే రీతిలో ఘన వీడ్కోలు పలికారు. ఖజానా, అకౌంట్స్ శాఖలో మూడు దశాబ్దాలకు పైగా వివిధ హోదాల్లో సమర్థవంతంగా విధులు నిర్వహించిన వెంటపల్లి సత్యనారాయణ, మహబూబాబాద్ జిల్లా ట్రెజరీ అధికారిగా ఆదివారం పదవీ విరమణ పొందారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన ఆత్మీయ సన్మాన సభలో సహోద్యోగులు ఆయన సేవలను స్మరించుకుంటూ భావోద్వేగానికి లోనయ్యారు. ఉద్యోగ జీవితంలో క్రమశిక్షణ, పారదర్శకత, నిబద్ధత, మానవీయ విలువలను పాటిస్తూ ఎందరో యువ ఉద్యోగులకు మార్గదర్శకుడిగా నిలిచారని కొనియాడారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన తెలంగాణ గెజిటెడ్ ఆఫీసర్స్ అసోసియేషన్ రాష్ట్ర అధ్యక్షుడు, రాష్ట్ర జేఏసీ సెక్రటరీ జనరల్ ఏలూరి శ్రీనివాసరావు మాట్లాడుతూ... వెంటపల్లి సత్యనారాయణ అందించిన సేవలు ఖజానా శాఖ చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని అన్నారు. ఆయన రచించిన 'ఖజానా చరిత్ర పరిణామాలు' గ్రంథం ట్రెజరీ శాఖ ఉద్యోగులకు మార్గదర్శకంగా ఉపయోగపడే విలువైన పుస్తకమని ప్రశంసించారు. శాఖ చరిత్రను భావితరాలకు అందించే గొప్ప ప్రయత్నంగా అభివర్ణించారు. ఉద్యోగ విరమణ సందర్భంగా స్పందించిన వెంటపల్లి సత్యనారాయణ మాట్లాడుతూ... "ఖజానా శాఖలో పనిచేయడం నాకు ఎంతో సంతృప్తిని ఇచ్చింది. ప్రభుత్వ ధనాన్ని ప్రజల ప్రయోజనాల కోసం సక్రమంగా నిర్వహించే బాధ్యతను అత్యంత పవిత్రమైన విధిగా భావించి పనిచేశానన్నారు. నా ప్రయాణంలో సహకరించిన అధికారులు, సహోద్యోగులు, సిబ్బంది, కుటుంబ సభ్యులందరికీ జీవితాంతం రుణపడి ఉంటాను" అని భావోద్వేగంగా తెలిపారు. అడిషనల్ కలెక్టర్ (లోకల్ బాడీస్) పురుషోత్తం మాట్లాడుతూ.. ప్రజాధన నిర్వహణలో నిజాయితీ, నిష్పాక్షికత ఎంత ముఖ్యమో వెంటపల్లి సత్యనారాయణ తన సేవల ద్వారా చాటిచెప్పారని పేర్కొన్నారు. మూడు దశాబ్దాలపాటు ప్రభుత్వ సేవలో నిబద్ధతకు ప్రతీకగా నిలిచిన వెంటపల్లి సత్యనారాయణ ఉద్యోగ జీవితం, విధి నిర్వహణలో విలువలను కాపాడుకోవాలనుకునే ప్రతి ప్రభుత్వ ఉద్యోగికి ఆదర్శంగా నిలుస్తుందని సభలో పలువురు అభిప్రాయపడ్డారు. ఆయన సేవా ప్రస్థానం యువ ఉద్యోగులకు స్ఫూర్తినిస్తూ, ప్రభుత్వ సేవలో నిజాయితీ, కర్తవ్యనిష్ఠలకు చిరునామాగా చిరకాలం గుర్తుండిపోతుందని కొనియాడారు. ఈ కార్యక్రమంలో టీజీవో ఖమ్మం జిల్లా కార్యదర్శి మోదుగు వేలాద్రి, టీజీవో మహబూబాబాద్ జిల్లా అధ్యక్షుడు రఫీ, షేక్ ఖాజా మియా, బానోత్ దస్రు, ఎన్. వి. కృష్ణారావు, జి. శ్రీనివాస్, రామకృష్ణ, షరీఫ్ బాబా, దుర్గాప్రసాద్, టి వెంకటేశ్వర్లు, శ్రీనివాసరావు, ప్రసన్న కుమార్, శారద, సునీత, ఉదయ భాస్కర్, సాగర్, కృష్ణ యాదవ్, రామకృష్ణ, వెంకన్న, రమేష్, సుందర్, రవిచంద్ర, ప్రవీణ్, రవీంద్ర బాబు, ప్రసన్న కుమార్, రాజా, సాహెబ్, సాయి ప్రవీణ్, వెంకటేశ్ యాదవ్, పృథ్వీ, కోలా వెంకటేశ్వర్లు, మధిర వెంకటేశ్వర్లు, ఫణి రాజకుమార్, విజయకుమార్, సౌజన్య, జ్యోతి, రమణ, పద్మావతి, శైలజ, ఉమ్మడి ఖమ్మం జిల్లా గెజిటెడ్ అధికారులు, టీఎన్జీవోస్, పెన్షనర్స్ అసోసియేషన్స్, బంధుమిత్రులు శ్రేయోభిలాషులు, ఖమ్మం జిల్లా ఖజానా కార్యాలయం సిబ్బంది, కొత్తగూడెం జిల్లా ఖజానా కార్యాలయ సిబ్బంది, మహబూబాబాద్ కార్యాలయం సిబ్బంది తదితరులు పాల్గొని ఘనంగా సన్మానించడం జరిగింది.

# ఓరుగల్లులో స్వరాభిషేకం...

- కళా సేవ రత్న అవార్డుతో ఈగ మల్లేశంకు సన్మానం




**హన్మకొండ ఆగస్టు 2 (పీసీడబ్ల్యూ న్యూస్):** ఓరుగల్లులో ప్రతిష్టాత్మకంగా ఏర్పాటు చేసిన స్వరాభిషేకం కార్యక్రమంలో ప్రముఖ కళాకారుడు ఈగ మల్లేశం ను కళాసేవ రత్న అవార్డుతో సన్మానించారు. ఉమ్మడి వరంగల్ జిల్లా వ్యాప్తంగా ఉన్న కళాకారులను ఈ కార్యక్రమంలో ఆహ్వానించి గాన కచేరి నిర్వహించారు. స్థానిక అంబేద్కర్ భవన్లో ఏర్పాటుచేసిన స్వరాభిషేకం కార్యక్రమంలో సినిమా పాటలు పాడి కళాకారులు ప్రేక్షకులు మంత్రముగ్ధుల్ని చేశారు. ఈ కార్యక్రమంలో నిర్వాహకుల ఆధ్వర్యంలో కళా సేవ రత్న అవార్డు గ్రహీత ఈగ మల్లేశం దంపతులను గజమాల తో సన్మానించి వారి సేవలు కొనియాడారు. అనంతరం ఈగ మల్లేశం మాట్లాడుతూ... ఈ స్వరాభిషేక కార్యక్రమం మొదటగా మద్రాస్ లో దివంగత బాలసుబ్రహ్మణ్యం నిర్వహించినప్పుడు తనను ఎంపిక చేయడం జరిగిందని, కానీ తాను అంత దూరం వెళ్లి అవార్డు తీసుకునే పరిస్థితిలో లేకపోవడం వల్ల ఓరుగల్లు కళాకారులు ఆ అవార్డును ఎలాగైనా వరంగల్లో నిర్వహించి మా కళాకారుని సన్మానించుకుంటామన్నారని, వారి కోరిక మేరకు ఇవాళ నాకు ఈ సన్మానం చేయడం అదృష్టంగా భావిస్తున్నాను అన్నారు. తన కుటుంబ కళాకారులకు చెందింది అని, కలల కోసం అహర్నిశలు కృషి చేస్తానని, మొదటిసారిగా తెలంగాణ ఉద్యమంలో స్వరాష్ట్ర సాధన కోసం కళాకారులను ఏకం చేసి, కేడీసీ గ్రౌండ్లో కళాకారుల ధూంధాం నిర్వహించామన్నారు. ఈ కార్యక్రమంలో ఆర్యవైశ్య ఫెడరేషన్ జాతీయ నాయకులు గట్టు మహేష్ బాబు మాట్లాడుతూ...ఓరుగల్లు కలలకు నిలయమని, ప్రముఖ సారంగపాణి, శంకర్ లను ఈ సందర్భంగా గుర్తు చేశారు. స్వరాభిషేక కార్యక్రమంలో దివంగత బాలసుబ్రమణ్యం ను వరంగల్ ఎన్ఐటిలో సన్మానించిన సంఘటనను ఈ సందర్భంగా గుర్తు చేశారు. తను అనునిత్యం కళాకారుల శ్రేయస్సు కోసమే కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో సెంట్రల్ జోన్ డీసీపీ ధార కవిత, ఏసీబీ జితేందర్ రెడ్డి, అడుప రవీందర్ తదితరులు జ్యోతి ప్రజులు చేసి కార్యక్రమాన్ని కొనసాగించారు. ఈ స్వరాభిషేకం కార్యక్రమంలో సుమారు 200 పాటలను పాడి కళాకారులు ఆకట్టుకున్నారు. ఈ కార్యక్రమంలో జనగాం రాము, పులి గణేష్, చంద్రశేఖర్, హంసలేక మధుసూదన్, జిబి కల్చర్ ఆర్ట్స్ జడల శివ, తదితరులు పాల్గొన్నారు.

# మహంకాళి ఆలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న మాజీ ఎమ్మెల్యే ఆరపల్లి మోహన్..

**మానకొండూరు, ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):** మానకొండూరు మండల కేంద్రంలోని మహంకాళి ఆలయంలో ఆదివారం నిర్వహించిన తిరుగువారం, ఒడి బియ్యం కార్యక్రమంలో మాజీ శాసనసభ్యులు, మాజీ ప్రభుత్వ విప్ శ్రీ ఆరపల్లి మోహన్ పాల్గొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సర్పంచ్ వర్షిణిశేఖర్ గౌడ్, ఉపసర్పంచ్ సాయిశ్రీశేఖర్, మాజీ ఎంపీటీసీ పిట్టల మధు, జేరిపోతుల సునీల్, ఎమ్మార్పీఎస్ నాయకులు కోంద్ర శంకర్, నాయి బ్రాహ్మణ సంఘం మండల అధ్యక్షుడు నడిగోట్టు క్రాంతితో పాటు పలువురు ముఖ్య నాయకులు, భక్తులు పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఈ సందర్భంగా ప్రజలందరికీ ఆయురారోగ్యాలు, సుఖసంతోషాలు కలగాలని అమ్మవారిని ప్రార్థించారు.



# సింహాద్రిపురం ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాలలో స్పాట్ అడ్మిషన్లు

- పాలిసెట్ పరీక్షకు హాజరుకాని విద్యార్థులకు అవకాశం
- పాలిటెక్నిక్ ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్




**సింహాద్రిపురం ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):**ప్రభుత్వ పాలిటెక్నిక్, సింహాద్రిపురం (వైయస్ఆర్ జిల్లా) లో 2026-27 విద్యా సంవత్సరానికి సంబంధించి డిప్లొమా కోర్సుల్లో ప్రవేశాల కోసం స్పాట్ అడ్మిషన్లు 05-08-2026 (బుధవారం) నిర్వహించబడుతున్నాయని ముఖ్యం గా పదవ తరగతి ఉత్తీర్ణులైన విద్యార్థులు అందరూ పాలిసెట్ -2026 రాసిన విద్యార్థులతో పాటు,ఏ కారణం చేతనైనా ఆ పరీక్షకు హాజరుకాని విద్యార్థులు సైతం ఈ స్పాట్ అడ్మిషన్ ద్వారా నేరుగా ప్రవేశం పొందవచ్చు అని పాలిటెక్నిక్ కళాశాల ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్ తెలిపారు.సీఎస్ఈ (కంప్యూటర్ సైన్స్ అండ్ ఇంజనీరింగ్)ఈసిఈ (ఎలక్ట్రానిక్స్ అండ్ కమ్యూనికేషన్ ఇంజనీరింగ్)ఈఈఈ (ఎలక్ట్రికల్ అండ్ ఎలక్ట్రానిక్స్ ఇంజనీరింగ్)సిఈ (సివిల్ ఇంజనీరింగ్)ఎంఈ (మెకానికల్ ఇంజనీరింగ్)కోర్సులకు ఆసక్తి గల విద్యార్థులు తమ ఒరిజినల్ విద్యార్హత ధృవపత్రాలతో పాటు నేరుగా కళాశాలకు హాజరుకావాలని ప్రిన్సిపాల్ డా.ఎ.శివ శంకర్ తెలిపారు.విద్యార్థుల సౌలభ్యం కోసం అడ్మిషన్ ప్రక్రియ ఉదయం నుంచే ప్రారంభించబడుతుందని దూర ప్రాంతాల నుండి వచ్చే విద్యార్థుల కొరకు కళాశాల ప్రాంగణంలోనే హాస్టల్ వసతి అందుబాటులో ఉందన్నారు.మరిన్ని వివరాల కోసం విద్యార్థులు మరియు తల్లిదండ్రులు నేరుగా కళాశాలను సంప్రదించవచ్చన్నారు.

# నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని రౌడీ షీటర్లకు పోలీసులు కౌన్సిలింగ్




**కర్నూలు ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):** కర్నూలు ఎస్పీ విక్రాంత్ పాటిల్ ఆదేశాల మేరకు జిల్లాలో నేరనియంత్రణ, శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా పోలీసు అధికారులు అన్ని పోలీసు స్టేషన్ల పరిధిలలో రౌడీ షీటర్లకు, నేరచరిత్ర గలవారికి , చెడు నడత కలిగిన వ్యక్తులకు ఆదివారం స్టేషన్ల కు పిలిపించి కౌన్సిలింగ్ నిర్వహించారు.సత్ప్రవర్తనతో జీవించాలని, నేర ప్రవృత్తికి స్వస్తి పలకాలని, చట్ట వ్యతిరేక కార్యకలాపాలకు దూరంగా ఉండాలని సూచించారు. చట్ట వ్యతిరేక కార్యకలాపాలలో పాల్గొంటే తప్పనిసరిగా చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకోవడం జరుగుతుందని పోలీసు అధికారులు హెచ్చరించారు.

# లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్‌కు డిస్ట్రిక్ట్ 316-జె లో ఉన్నత పదవులు



**అన్నమయ్య ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):** గుత్తిలో జరిగిన 9 వ డిస్ట్రిక్ట్ క్యాబినెట్ ప్రమాణస్వీకార మహోత్సవంలో లయన్స్ క్లబ్ ఆఫ్ రాయచోటి టౌన్ సభ్యులలో గవర్నర్ అడ్వైజరీ కమిటీ మెంబర్ గా లయన్ పి.ఎస్.హరనాథ రెడ్డి, జోన్ చైర్మన్ గా లయన్ పి.శివారెడ్డి,డిస్ట్రిక్ట్ చైర్మన్ లుగా లయన్ యం.అశోక్ రెడ్డి,లయన్ డా.శ్యాంసుందర్ రెడ్డి,లయన్ షేక్ మహమ్మద్ లకు పదవులు ఇస్తూ జిల్లాలో విస్తృత సేవ చేయాలని జిల్లా గవర్నర్ పి.ఎం.జె.ఎఫ్ లయన్ వీరుపాక్ష రెడ్డి ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఇంటర్నేషనల్ డైరెక్టర్స్ ,మల్టిపుల్ లీడర్స్ పి.ఎం.జె.ఎఫ్ లయన్ సుధాకర్ రెడ్డి, పి.ఎం.జె.ఎఫ్లయన్ ఉపేంద్ర, అధ్యక్షులు లయన్ యస్.రామాంజనేయ రెడ్డి,కార్యదర్శి లయన్ షేక్ ఇందాద్ అహమ్మద్,లయన్ మురళి పాల్గొన్నారు.

# కాకినాడలో ఏడేళ్లు విధుల నిర్వహణలో సంతృప్తి: విశ్రాంత ఎస్ఇ ప్రసాద్



**కాకినాడ ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):** కాకినాడ జిల్లాలో విద్యుత్ శాఖ పర్యవేక్షక ఇంజనీర్ (ఎస్ఇ)గా విధులు నిర్వహించడం ఎంతో సంతృప్తి కలిగిందని విద్యుత్ శాఖ ఎస్ఇగా పనిచేసిన గొర్ల ప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం ప్రసాద్ పదవి విరమణ సభను ఆ శాఖ ఉద్యోగులు జి కన్వెన్షన్లో నిర్వహించి అతనిపై అభిమానాన్ని చాటుకున్నారు. ఈ సందర్భంగా జిల్లాలో విద్యుత్ శాఖలో పనిచేస్తున్న డిఇలు, ఎఇలు, లైన్మెన్లు, సిబ్బంది హాజరయ్యారు. ఈ సందర్భంగా ప్రసాద్ గురించి విశ్రాంత అధికారులు, విధుల్లో ఉన్న అధికారులు చేసిన పనులను వివరించారు. ప్రసాద్ మాట్లాడుతూ 2015లో కాకినాడకు బదిలీ అయ్యానని తిరిగి వెళ్ళిపోదాం అనుకున్నా ఇక్కడ వారు చూపించే ప్రేమ అభిమానం తనను తిరిగి వెళ్ళనీయ లేదన్నారు. సిబ్బంది సహకారం జిల్లాలో అందరి కలెక్టర్ల వద్ద పనిచేసి గౌరవం సంపాదించుకున్నట్లు చెప్పారు. అనంతరం ప్రసాద్, సుధారాణి దంపతులను పూలమాలతో సన్మానించారు. ప్రసాద్ కుటుంబ సభ్యులు సుదూర ప్రాంతాల నుంచి వారి మిత్రులు ఈ కార్యక్రమానికి హాజరయ్యారు. ఈ కార్యక్రమంలో కాకినాడ ఇఇ ఎన్ ఉదయ్ భాస్కర్, కె రాంబాబు, రాంజీ నాయుడు, సత్యనారాయణ రెడ్డి, రామ్మోహన్రావు, గోపాలకృష్ణ, సాయి ప్రీతం, ప్రసాద్, రవికుమార్, శ్రీనివాస్, వీరభద్రరావు, ప్రభాకర్, మోహన్, ఆదినారాయణమూర్తి తదితరులు పాల్గొన్నారు.




# ఘనంగా బళ్లారి రాఘవ జయంతి వేడుకలు

**నాటక రంగానికి బళ్లారి రాఘవ సేవలు స్ఫూర్తిదాయకం**

**కళను సామాజిక చైతన్యానికి సాధనంగా మలిచిన మహనీయుడు**

**జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ**



**కర్నూలు ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):**-తెలుగు నాటక రంగ పితామహుడు, మహానటుడు బళ్లారి రాఘవ జయంతి వేడుకలను ఆదివారం కర్నూలు కలెక్టరేట్ మినీ కాన్ఫరెన్స్ హాల్‌లో ఘనంగా నిర్వహించారు. జిల్లా యువజన సంక్షేమ శాఖ, సెట్కూర్ ఆధ్వర్యంలో జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో బళ్లారి రాఘవ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఈ సందర్భంగా జిల్లా రెవెన్యూ అధికారి వెంకట నారాయణమ్మ మాట్లాడుతూ, బళ్లారి రాఘవ కళను సామాజిక చైతన్యానికి సాధనంగా మలిచిన మహోన్నత వ్యక్తి అని పేర్కొన్నారు. మహిళలు, యువత కళారంగంలో ముందుకు సాగేందుకు ఆయన జీవితం స్ఫూర్తిదాయకమని అన్నారు. తెలుగు భాష, సాహిత్యంతో పాటు సాంస్కృతిక విలువలను భావితరాలకు అందించడం ప్రతి ఒక్కరి బాధ్యత అని తెలిపారు.లలిత కళా సమితి సాంస్కృతిక సంఘం అధ్యక్షులు పత్తి ఓబులయ్య మాట్లాడుతూ, బళ్లారి రాఘవ తెలుగు సంస్కృతికి జీవం పోసిన మహానుభావుడని కొనియాడారు. గ్రామీణ ప్రాంతాల్లో నాటక కళను ప్రోత్సహించడం ద్వారా యువతలో సృజనాత్మకత, క్రమశిక్షణ, సామాజిక బాధ్యత పెంపొందుతాయని తెలిపారు.ఆంధ్రప్రదేశ్ తెలుగు ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ అధ్యక్షులు కనుసుకర కరణ్ మాట్లాడుతూ, బళ్లారి రాఘవ వంటి మహానటుల సేవలను స్మరించుకోవడం ద్వారా నేటి తరం కళాకారులకు దిశానిర్దేశం లభిస్తుందని పేర్కొన్నారు.జిల్లా యువజన సంక్షేమ శాఖ అధికారి డాక్టర్ వేణుగోపాల్ మాట్లాడుతూ, యువతలో కళలు, సంస్కృతి, భాష, సాహిత్యంపై ఆసక్తి పెంపొందించడం శాఖ ప్రధాన లక్ష్యమని తెలిపారు. ప్రతిభావంతులైన యువ కళాకారులను గుర్తించి వారికి తగిన వేదికలు కల్పించేందుకు కృషి చేస్తున్నామని అన్నారు.బళ్లారి రాఘవ సేవలు తెలుగు నాటక చరిత్రలో చిరస్థాయిగా నిలిచిపోతాయని వక్తలు పేర్కొన్నారు. కళ సమాజంలో విలువలు, నైతికత, దేశభక్తి, మానవతా దృక్పథాన్ని పెంపొందించే శక్తివంతమైన సాధనమని తెలిపారు. యువత తెలుగు సంస్కృతి, సంప్రదాయాలను భావితరాలకు అందించేందుకు కృషి చేయాలని పిలుపునిచ్చారు.ఈ కార్యక్రమంలో పత్తి ఓబులయ్య, డాక్టర్ వేణుగోపాల్, జిల్లా పర్యాటక, సాంస్కృతిక శాఖ ల అధికారులు, సినీ, రంగస్థల కళాకారులు, సాహితీవేత్తలు, విద్యార్థులు, కళాభిమానులు పాల్గొన్నారు.

# డాక్యుమెంట్ రైటర్లకు సామాజిక భద్రత కల్పించాలి

- ప్రత్యేక సంక్షేమ బోర్డు ఏర్పాటు చేయాలి:ఎన్. కృష్ణయ్య




**పత్తికొండ ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):**డాక్యుమెంట్ రైటర్లకు సామాజిక, ఆర్థిక భద్రత కల్పించి, వారి సంక్షేమం కోసం ప్రత్యేక వెల్ఫేర్ బోర్డును ఏర్పాటు చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు ఎన్. కృష్ణయ్య ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.ఏఐటీయూసీ ఆధ్వర్యంలో స్థానిక కన్యకా పరమేశ్వరి కళ్యాణ మండపంలో దస్తావేజు లేఖరుల సమావేశం నిర్వహించారు.ఏఐటీయూసీ తాలూకా అధ్యక్షుడు నెట్టికంటి అయ్య అధ్యక్షతన జరిగిన సమావేశానికి ఎన్. కృష్ణయ్య, సీపీఐ మండల కార్యదర్శి యు. కారుమంచి, ఏఐటీయూసీ తాలూకా కార్యదర్శి హెచ్. రంగన్న హాజరయ్యారు.ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రజలకు, రిజిస్ట్రేషన్ వ్యవస్థకు మధ్య డాక్యుమెంట్ రైటర్లు వారధిలా పనిచేస్తున్నప్పటికీ, వారికి సరైన గుర్తింపు, ఆదాయ భద్రత లేక అనేక ఇబ్బందులు ఎదురవుతున్నాయని తెలిపారు. నిత్యావసరాల ధరలు పెరిగినా దశాబ్దాలుగా లేఖన రుసుములు పెంచకపోవడంతో కుటుంబాల పోషణ కష్టంగా మారిందన్నారు.డాక్యుమెంట్ రైటర్లకు ఈఎస్ఐ, పీఎఫ్, ఆరోగ్య, ప్రమాద బీమా, పింఛను సౌకర్యాలు కల్పించాలని కోరారు. అధికారిక గుర్తింపు కార్డులు, లైసెన్సులు మంజూరు చేసి, ఆన్‌లైన్ రిజిస్ట్రేషన్ విధానాలపై ఉచిత సాంకేతిక శిక్షణ ఇవ్వాలని డిమాండ్ చేశారు.డాక్యుమెంట్ రైటర్స్ వెల్ఫేర్ బోర్డు ఏర్పాటు చేసి, ఆరోగ్య రక్షణ, బీమా, పింఛను సదుపాయాలు కల్పించాలని కోరారు. ప్రతి సబ్‌రిజిస్ట్రార్ కార్యాలయం వద్ద లేఖరులు పనిచేసేందుకు ప్రత్యేక గదులు లేదా షెడ్లు ఏర్పాటు చేయాలన్నారు.జీవో నంబర్ 396ను రద్దు చేసి, రిజిస్ట్రేషన్ సేవా కేంద్రాలను ఉపసంహరించుకోవడంతో పాటు డాక్యుమెంట్ రైటర్ల ఉపాధిని కాపాడాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.


**నూతన కమిటీ ఎన్నిక** అనంతరం దస్తావేజు లేఖరుల నూతన కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. గౌరవ అధ్యక్షుడిగా ఎన్. కృష్ణ, అధ్యక్షుడిగా బి. నాగేంద్ర, ఉపాధ్యక్షులుగా వి. రవి, సాయి ప్రతాప్ నాయుడు, కార్యదర్శిగా ఆరోగ్యస్వామి, సహాయ కార్యదర్శులుగా వై. సుధాకర్, ఎస్. సుధాకర్, కోశాధికారిగా బి. రాజులను ఎన్నుకున్నారు.ఈ కార్యక్రమంలో బి. మాదన్న, గుండు భాష, హనుమేష్ నాయక్, అల్తాఫ్, నాగేంద్ర, రవి, సుధాకర్ తదితరులు పాల్గొన్నారు.

# 2025-26 బెస్ట్ రోటరీ క్లబ్ అవార్డు సాధించిన ప్రొద్దుటూరు రోటరీ క్లబ్




**ప్రొద్దుటూరు ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):** రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3160 పరిధిలో 202526 సంవత్సరానికి "బెస్ట్ రోటరీ క్లబ్"గా ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ ప్రతిష్టాత్మక అవార్డును సొంతం చేసుకుంది. గోవాలోని జూరీ వైట్ సాండ్స్ రిసార్ట్ సభా భవనంలో శనివారం నిర్వహించిన రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3160 అవార్డుల ప్రధానోత్సవంలో అప్పటి డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం.కే. రవీంద్ర ఆధ్వర్యంలో ఈ అవార్డులు ప్రదానం చేశారు. ముఖ్య అతిథులుగా ప్రస్తుత డిస్ట్రిక్ట్ గవర్నర్ కేశవరెడ్డి, రోటరీ ఇంటర్నేషనల్ డిస్ట్రిక్ట్ 3170 గవర్నర్ డా. లెన్ని డీ'కోస్టా, ఐపీడీజీ ఎం.కే. రవీంద్ర పాల్గొని అవార్డులను అందజేశారు.ఈ సందర్భంగా 202526 ప్రొద్దుటూరు రోటరీ క్లబ్ అధ్యక్షుడు గజ్జల వెంకటేశ్వర రెడ్డికి బెస్ట్ రోటరీ క్లబ్ అవార్డుతో పాటు నేషన్ బిల్డర్ అవార్డు, పబ్లిక్ ఇమేజ్ అవార్డు, కమ్యూనిటీ సర్వీస్ అవార్డు, ఎడ్యుకేషన్ అండ్ స్టూడెంట్ వెల్ఫేర్ అవార్డు, న్యూ రోటరాక్ట్ క్లబ్ ఫార్మేషన్ అవార్డులను ప్రదానం చేశారు.అవార్డుల ప్రదానోత్సవంలో మాట్లాడిన రోటరీ నాయకులు, రోటరీ 7 ఏరియాస్ ఆఫ్ ఫోకస్కు అనుగుణంగా సేవా కార్యక్రమాలను ప్రణాళికాబద్ధంగా అమలు చేయడం, రోటరీ సేవలను ప్రజల్లోకి విస్తృతంగా తీసుకెళ్లడం, సంస్థ ప్రతిష్ఠను పెంపొందించడంలో విశేష కృషి చేసిన మాజీ అధ్యక్షుడు గజ్జల వెంకటేశ్వర రెడ్డి, కార్యదర్శి షేక్ బాబా, ఖజాంచి దొంతు బాలాజీ, క్లబ్ సభ్యులు మరియు రోటరీ ఐ హాస్పిటల్ సేవలను ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో ఫస్ట్ లేడీ వేద రవీంద్ర, డీజీఈ జోషి, డీజీఎన్ ఎం.కే. మాధవరెడ్డి, చిన్నపరెడ్డి, ఐపీజీ కె.వి. మురళీధర్ రెడ్డి, పి. నాగేశ్వర రెడ్డి, పి.ఎల్. శ్రీధర్ రెడ్డి, పలువురు పీడీజీలు, ఏజీలు మరియు డిస్ట్రిక్ట్ 3160కు చెందిన రొటేరియన్లు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

# తెలుగు వారు గర్వపడేలా అమెరికా మేరీల్యాండ్లో చరిత్ర సృష్టించిన 'రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్': ప్రముఖుల నుంచి ప్రశంసలు






**చెన్నూరు ఆగస్టు 2(పిసిడబ్ల్యూ న్యూస్):**-తెలుగు రాష్ట్రాలకే అంకితమైన మొట్టమొదటి ఎయిర్ అంబులెన్స్ సేవ 'రియాక్ట్'.. అమెరికా నేలపై జోరు చూపిస్తోంది. అమెరికా తెలుగు సంఘం (ఏటీఏ) 19వ వార్షిక మహాసభలు జులై 31 నుంచి ఆగస్టు 2 వరకు మూడు రోజులపాటు జరుగుతున్న విషయం తెలిసిందే, మేరీల్యాండ్లో ఘనంగా జరుగుతున్న వేళ, ఈ అత్యాధునిక వైద్య సేవ ఏర్పాటు చేసిన ప్రత్యేక మండపం.. భారీ ఆకర్షణగా మారింది. హాజరైన వేలాది తెలుగు ప్రజలు, స్థానిక ప్రముఖులు ఈ వినూత్న సేవను చూసి ఆశ్చర్యపోయారు,ఈ ప్రత్యేక వేదికను పలువురు సీనియర్ నేతలు, వైద్య నిపుణులు, సినీ ప్రముఖులు పర్యటించి..'రియాక్ట్' సేవలను మనస్ఫూర్తిగా కొనియాడారు. అమెరికా నుంచి తెలుగు రాష్ట్రాలకు, ప్రపంచంలోని ఇతర ప్రాంతాలకు 24×7 అందుబాటులో ఉండే ఈ సర్వీసు పనితీరు గురించి ఆంధ్రప్రదేశ్ కడప జిల్లా మండల కేంద్రమైన చెన్నూరు చెందిన తప్పెట డాక్టర్ నీల్ రోహిత్ రెడ్డి సజీవ ప్రదర్శన (లైవ్ డెమో) ద్వారా వివరించారు. డాక్టర్ రోహిత్ రెడ్డి మాట్లాడుతూ.."ఒక్క క్షణం ఆలస్యమైనా ప్రాణాలకు సమానం. మా లక్ష్యం ఆ అమూల్యమైన క్షణాలను కాపాడటమే" అంటూ సభికులను సంభ్రమాశ్చర్యాల్లో ముంచెత్తారు.సంస్థ అంతర్జాతీయ ప్రతినిధులు యన్నంరెడ్డి వినీలారెడ్డి, ఉత్తర అమెరికా ప్రధాన కార్యదర్శి సుకుమార్ రెడ్డి ఈ ఎయిర్ అంబులెన్స్ ఏ విధంగా ప్రాణాలను గగనమార్గంలో రక్షిస్తుందో, అందులోని అత్యాధునిక టెక్నాలజీ, ఇంటెన్సివ్ కేర్ యూనిట్ ( ఐసీయూ) ఏర్పాట్లను వివరంగా వెల్లడించారు. తెలుగు ప్రజలు మాత్రమే కాదు, అక్కడి స్థానిక అమెరికన్ ప్రతినిధులు కూడా ఈ వ్యవస్థ పట్ల అద్భుతమైన ఆసక్తిని ప్రదర్శించారు.ఈ కార్యక్రమానికి హాజరైన ప్రముఖ శతావధాని, సాహిత్యవేత్త నరాల రామారెడ్డి .రియాక్ట్ సేవలను అత్యంత అద్భుతమైన ఉపమానంతో కొనియాడారు. ఆయన మాట్లాడుతూ.. "రోగికి సమయమే అమృతం. ఈ సంస్థ ఆ అమృతాన్ని అందించే దివ్యౌషధం" అంటూ ప్రశంసల వర్షం కురిపించారు. దీంతో ఆ వేదిక మరింత గమనార్హమైంది.అంతర్జాతీయ స్థాయిలో తెలుగు వారి ఔన్నత్యాన్ని చాటుతూ, రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ ప్రాణాధారమైన అవసరంలో భరోసానిచ్చే 'గగన సైన్యం'గా అవతరిస్తోంది. ఈ ప్రత్యేక కార్యక్రమం ఏటీఏ మహాసభల్లోనే కాక, తెలుగు సోషల్ మీడియా వేదికలనూ హల్చల్ చేస్తోంది. ఇక ముందు మన తెలుగు వారి ఆరోగ్య రక్షణ కోసం ఇది ఎంతో కీలకమైన మైలురాయి అని చెప్పాలి!కుమారి ఆలయ ,కుమారి ఆమని అసోసియేట్ డైరెక్టర్లు మరియు మార్కెటింగ్ ఎగ్జిక్యూటివ్స్ రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ అమెరికా సంయుక్త రాష్ట్రాలు ,దావయెన్నంరెడ్డి లావణ్యరెడి ఆపరేషన్స్ ఛైర్మన్ రియాక్ట్ ఎయిర్ అంబులెన్స్ విదేశీ ప్రతినిధులకు సంస్థ ఆశయాలను వివరించారు,

# రిటైర్ అయిన రహానేకు బీసీసీఐ నుంచి ప్రతి నెలా ఎంత పెన్షన్, బెనిఫిట్స్ తెలిస్తే షాకే




భారత టెస్ట్ జట్టు మాజీ వైస్ కెప్టెన్, స్టార్ బ్యాటర్ అజింక్య రహానే ఇటీవల అంతర్జాతీయ క్రికెట్‌లోని అన్ని ఫార్మాట్ల నుంచి సంన్యాసం తీసుకుంటున్నట్లు ప్రకటించాడు. ఒక ప్రత్యేక వీడియోను షేర్ చేస్తూ క్రీడాకారుడిగా తన మైదాన ప్రయాణాన్ని ముగిస్తున్నానని వెల్లడించాడు. అయితే క్రికెట్‌తో తన అనుబంధం ఇక్కడితో ముగిసిపోలేదని, తన సుదీర్ఘ అనుభవాన్ని, నేర్చుకున్న పాఠాలను యువ ఆటగాళ్లకు నేర్పిస్తూ క్రికెట్ రంగానికి సేవ చేస్తానని ఆయన పేర్కొన్నాడు. రిటైర్మెంట్ పొందిన ఆటగాళ్ల కోసం బీసీసీఐ నిర్వహిస్తున్నస్పెషల్ వెల్ఫేర్ స్కీమ్‌లో రహానే అత్యున్నత హైయెస్ట్ కేటగిరీ కిందకు వస్తాడు.
ఆటగాళ్లకు పెన్షన్ నిధులు బీసీసీఐకి ఎక్కడి నుంచి వస్తాయి?క్రికెటర్లకు ఇచ్చే పెన్షన్ల కోసం బీసీసీఐ వద్ద ఒక ప్రత్యేక సంక్షేమ వ్యవస్థ ఉంది. ప్లాటినం జూబ్లీ కార్పస్ ఫండ్, ప్రత్యేక వెల్ఫేర్ ఫండ్ ద్వారా బీసీసీఐ ఈ నిధులను సేకరిస్తుంది. ముఖ్యంగా ఐపీఎల్ ప్లేఆఫ్ మ్యాచ్‌లు, టికెట్ల విక్రయాల ద్వారా వచ్చే ఆదాయంలో కొంత భాగాన్ని ఈ ఫండ్‌కు కేటాయిస్తారు. రిటైర్ అయిన మాజీ ఆటగాళ్ల ఆర్థిక పరిస్థితి బాగుండాలని, వారి భవిష్యత్తుకు భరోసా ఇవ్వాలనే ఉద్దేశంతో బీసీసీఐ ఈ పథకాన్ని ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తోంది.రహానేకు ప్రతినెలా ఎంత పెన్షన్ వస్తుంది?బీసీసీఐ ప్రస్తుత పాలసీ ప్రకారం.. భారత్ తరఫున 25 లేదా అంతకంటే ఎక్కువ టెస్టు మ్యాచ్‌లు ఆడిన ఆటగాళ్లకు నెలకు రూ. 70,000 చొప్పున జీవితకాల పెన్షన్ లభిస్తుంది. రహానే తన కెరీర్‌లో ఏకంగా 85 టెస్టు మ్యాచ్‌లు ఆడాడు. దీనితో పాటు 90 వన్డేలు, 20 టీ20 మ్యాచ్‌లలో భారత్‌కు ప్రాతినిధ్యం వహించాడు. అందువల్ల ఆయనకు ప్రతి నెలా రూ. 70,000 పెన్షన్ ఖాతాలో జమ అవుతుంది. కాగా రహానే ముంబై రంజీ జట్టుకు కెప్టెన్‌గా ఉన్నందున ముంబై క్రికెట్ అసోసియేషన్ నుంచి కూడా పెన్షన్ పొందే అర్హత ఉంది. కానీ నిబంధనల ప్రకారం బీసీసీఐ లేదా స్టేట్ అసోసియేషన్ రెండింటిలో ఏదో ఒకదాని నుంచే పెన్షన్ ఎంచుకోవాల్సి ఉంటుంది. రహానే బీసీసీఐ పెన్షన్‌నే ఎంచుకునే అవకాశం ఉంది.పెన్షన్‌పై ఉన్న ముఖ్యమైన నిబంధన ఏమిటి?రహానేకు లభించే ఈ జీవితకాల పెన్షన్‌పై ఒక కీలకమైన షరతు ఉంది. ఒకవేళ రహానే భవిష్యత్తులో బీసీసీఐలో లేదా జాతీయ జట్టులో జీతం లభించే ఏదైనా అధికారిక పదవిని (ఉదాహరణకు కోచ్, సెలెక్టర్ వంటివి) చేపడితే, ఆయనకు వచ్చే నెలవారీ పెన్షన్ నిలిపివేస్తారు. మళ్లీ ఆ పదవి నుంచి తప్పుకున్న వెంటనే పెన్షన్ పునరుద్ధరిస్తారు. రహానే తన రిటైర్మెంట్ పోస్ట్‌లో భవిష్యత్తులో కోచింగ్ వైపు వెళ్లే ఆలోచన ఉందనే

# అన్‌క్లెయిమ్ డబ్బును వడ్డీతో ఎలా పొందాలో తెలుసా?




షనల్ పెన్షన్ సిస్టమ్ (చీూఎర్వఎ)లో పెట్టుబడి పెట్టిన లక్షలాది మంది ఖాతాదారులకు ఒక ముఖ్యమైన సూచన వెలువడింది. గతంలో చేసిన కానీ ఖాతాలో జమ కాని కాంట్రిబ్యూషన్లు ఉన్నా, అవి శాశ్వతంగా కోల్పోయినట్లుకాదని నిపుణులు చెబుతున్నారు. అర్హులైన వారు నిర్దిష్ట ప్రక్రియ ద్వారా వాటిని తిరిగి పొందే అవకాశం ఉందని స్పష్టం చేస్తున్నారు. ఈ ప్రక్రియను పర్యవేక్షిస్తున్న పెన్షన్ ఫండ్ రెగ్యులేటరీ అండ్ డెవలప్మెంట్ అథారిటీ 'సబ్‌స్క్రైబర్స్ పెన్షన్ కాంట్రిబ్యూషన్ ప్రొటెక్షన్ అకౌంట్' () అనే ప్రత్యేక భద్రతా ఖాతాను నిర్వహిస్తోంది. ఇందులో సబ్‌స్క్రైబర్ చెల్లించినప్పటికీ (పర్మనెంట్ రిటైర్మెంట్ అకౌంట్ నంబర్)కు జమ కాని నిధులు నిల్వ ఉంటాయి. సృష్టించకపోవడం, సిస్టమ్ లోపాలు లేదా మధ్యవర్తుల సమస్యలు వంటి కారణాల వల్ల ఈ పరిస్థితి ఏర్పడుతుంది.సాధారణంగా క్లెయిమ్ చేయని నిధులు 7 సంవత్సరాల తర్వాత కు బదిలీ అవుతాయి. అయితే కొన్ని సందర్భాల్లో మధ్యవర్తి అంతరాయం వల్ల ముందుగానే కూడా బదిలీ కావచ్చు. ముఖ్యంగా లేదా అగ్రిగేటర్ ద్వారా చెల్లించిన మొత్తాలు ఖాతాలో కనిపించకపోతే, సబ్‌స్క్రైబర్లు క్లెయిమ్‌కు అర్హులవుతారు. క్లెయిమ్ ప్రక్రియలో భాగంగా, నిర్దేశిత ఫారం మరియు చెల్లింపు రుజువులను సమర్పించాలి. ఈ క్లెయిమ్‌నుకి నేరుగా లేదా సంబంధిత మధ్యవర్తి ద్వారా దాఖలు చేయవచ్చు. లోకి బదిలీ అయిన తేదీ నుంచి 25 సంవత్సరాల వరకు ఈ అవకాశం అందుబాటులో ఉంటుంది. ధృవీకరణ అనంతరం, అసలు మొత్తం మాత్రమే కాకుండా వర్తించే వడ్డీతో కూడిన మొత్తం నేరుగా బ్యాంక్ ఖాతాలో జమ అవుతుంది.

# కోహ్లీ, అభిషేక్ తర్వాత ఈషాన్..



భారత స్టార్ వికెట్ కీపర్ బ్యాటర్ ఈషాన్ కిషన్ ఇటీవల ఐసీసీ టీ20 ర్యాంకింగ్స్‌లో 900 రేటింగ్ పాయింట్ల మార్కును దాటి సంచలనం సృష్టించాడు. ప్రస్తుతం ఆయన 916 రేటింగ్ పాయింట్లతో టీ20 ర్యాంకింగ్స్‌లో నంబర్-1 స్థానంలో కొనసాగుతున్నాడు. జింబాబ్వే పర్యటనలో అద్భుతమైన ఫామ్‌ను కనబరిచి ఆ సిరీస్‌లో రెండవ అత్యధిక పరుగులు చేసిన బ్యాటర్‌గా నిలవడమే అతని రేటింగ్ ఈ స్థాయికి చేరడానికి ప్రధాన కారణం. ఈ ఘనతతో ఐసీసీ ర్యాంకింగ్స్ చరిత్రలో అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన టాప్-5 భారత బ్యాటర్ల జాబితాలో ఈషాన్ కిషన్ తన పేరును లిఖించుకున్నాడు.

అగ్రస్థానంలో నిలిచిన కింగ్ కోహ్లీ

ఐసీసీ ర్యాంకింగ్స్‌లో భారత్ తరఫున అత్యధిక రేటింగ్ పాయింట్లు సాధించిన బ్యాటర్‌గా విరాట్ కోహ్లీ అగ్రస్థానంలో కొనసాగుతున్నాడు. ఆయన తన కెరీర్ అత్యుత్తమంగా టెస్టుల్లో 937 రేటింగ్ పాయింట్లను సాధించాడు. మూడు ఫార్మాట్లలోనూ (టెస్టులు, వన్డేలు, టీ20లు) 900 కంటే ఎక్కువ రేటింగ్ పాయింట్లు సాధించిన ఏకైక భారతీయ ఆటగాడిగా విరాట్ చరిత్ర సృష్టించాడు. వన్డేలలో 911 పాయింట్లు, టీ20లలో 909 పాయింట్ల వరకు ఆయన చేరుకున్నాడు. ప్రస్తుతం టెస్టులు, టీ20లకు గుడ్ బై చెప్పిన విరాట్ కోహ్లీ, కేవలం వన్డేల్లో మాత్రమే కొనసాగుతూ 2027 ప్రపంచ కప్ సాధించడమే లక్ష్యంగా ముందుకు సాగుతున్నాడు.

గవాస్కర్?ను దాటేసిన అభిషేక్ శర్మ

ఈ జాబితాలో భారత యంగ్ సెన్సేషన్ అభిషేక్ శర్మ దిగ్గజ ఆటగాడు సునీల్ గవాస్కర్‌ను దాటేసి రెండవ స్థానంలో నిలిచాడు. గవాస్కర్ తన టెస్టు కెరీర్‌లో అత్యుత్తమంగా 916 రేటింగ్ పాయింట్లు సాధించగా, అభిషేక్ శర్మ టీ20లలో ఏకంగా 931 రేటింగ్ పాయింట్లతో ఈ జాబితాలో రెండో స్థానంలో ఉన్నాడు. కొంతకాలం పాటు టీ20 నంబర్-1 బ్యాటర్‌గా రాజ్యమేలిన అభిషేక్ శర్మ, జింబాబ్వే పర్యటనలో కాస్త తడబడటంతో ప్రస్తుతం రెండో స్థానంలో కొనసాగుతున్నాడు.

## కేవలం రూ.50 వేలు ఖర్చు పెడితే చాలు నెలకు రూ.60 వేల సంపాదన.



వ్యాపారం అంటే లక్షలు, కోట్లతో కూడుకున్న పని అని చాలామంది పొరపాటు పడుతుంటారు. మీరు బిజినెస్ స్టార్ట్ చేయాలంటే లక్షలు, కోట్లు అవసరం లేదు. తక్కువ పెట్టుబడితో మొదలుపెట్టగలిగే వ్యాపారాలు చాలానే ఉన్నాయి. మీ దగ్గర రూ.50 వేలు ఉన్నా మంచి వ్యాపారం ప్రారంభించి అధిక ఆదాయం పొందవచ్చు. సరైన ప్లానింగ్ తెలివి, హార్డ్ వర్క్ చేసే తత్వం ఉంటే బాగా డబ్బులు సంపాదించవచ్చు. బిజినెస్ స్టార్ట్ చేసిన తక్కువ సమయంలోనే డబ్బులు మీ చేతిలోకి వస్తాయి. రూ.50 వేలలో మొదలుపెట్టగలిగే ఐదు బెస్ట్ బిజినెస్‌ల గురించి ఇప్పుడు తెలుసుకుందాం.

హోమ్ ఫుడ్ బిజినెస్

ఫుడ్ బిజినెస్ చేయాలంటే రూమ్ అవసరం లేదు. కేవలం మీ వంటిట్లోనే ఆహార పదార్థాలు వండి విక్రయించవచ్చు. ఆఫీసులకు వెళ్లే ఉద్యోగులు, విద్యార్థులకు మీరు విక్రయించి డబ్బులు సంపాదించవచ్చు. రోజుకు మీరు 30 నుంచి 50 మందికి అందించినా నెలకు రూ.60 వేల వరకు సంపాదించవచ్చు. ఖర్చులు పోను మీకు రూ.30 వేల వరకు మిగులుతాయి. అయితే కిరాణా సరుకులకు రూ.15 వేలు, ప్యాకింగ్ మెటీరియల్స్‌కు రూ.10 వేలు, డెలివరీ రూ.15 వేలు ఖర్చు అవుతుంది. ఇక వంట పాత్రలకు రూ.10 వేలు అవుతుంది. రూ.50 వేల ఖర్చుతో మీరు ఈ వ్యాపారం స్టార్ట్ చేయవచ్చు.

ఇక మొబైల్ యాక్సెసరీస్ విక్రయం

మొబైల్ ఛార్జర్లు, ఇయర్ ఫోన్లు, పవర్ బ్యాంక్, టెంపర్డ్ గ్లాస్ వంటివి విక్రయించడం ద్వారా మంచి ఆదాయం పొందవచ్చు. ఎక్కువగా విక్రయాలు జరిగితే నెలకు రూ.25 నుంచి రూ.40 వేల వరకు మీరు సంపాదించవచ్చు. స్టాక్ ఖర్చు రూ.35 వేలు, షెల్ప్ రూ.10 వేలు, ప్రచారానికి రూ.5 వేలు ఖర్చు అవుతుంది.

ప్రింటింగ్, జిరాక్స్

జిరాక్స్, లామినేషన్, కలర్ ప్రింట్, స్పైరల్ బైండింగ్ వంటి వాటి ద్వారా మీరు డబ్బులు సంపాదించవచ్చు. స్కూల్స్, కాలేజీలు, ఆఫీసుల దగ్గర మీరు ఈ వ్యాపారం స్టార్ట్ చేస్తే డబ్బులు ఎక్కువగా వస్తాయి. నెలకు రూ.30 వేల నుంచి రూ.50 వేల వరకు సంపాదించవచ్చు. ప్రింటర్‌కు రూ.20 వేలు, కంప్యూటర్ రూ.20 వేలు, పేపర్, ఇంక్ రూ.10 వేలు ఖర్చు అవుతుంది.

నేచురల్ ప్రొడక్ట్స్ అమ్మకం

రాగి పిండి, కారం పొడి, సజ్జ పిండి, పసుపు, ఆర్గానిక్ బెల్లం, కోల్డ్ ప్రెస్డ్ ఆయిల్ వంటి వాటివి విక్రయించే ఆదాయ పొందవచ్చు. నెలకు రూ.50 వేల వరకు సంపాదించవచ్చు.

# పాండ్యా బ్రదర్స్ మళ్లీ కలిసిపోయారా




భారత క్రికెట్‌లో అత్యంత ప్రజాదరణ పొందిన అన్నదమ్ముల జోడీలలో హార్దిక్ పాండ్యా, కృణాల్ పాండ్యా ముందుంటారు. మైదానంలోనైనా, బయటనైనా వీరు ఎప్పుడు కలిసి కనిపించినా అభిమానుల్లో తీవ్ర ఆసక్తి నెలకొంటుంది. అయితే గత కొన్ని నెలలుగా వీరిద్దరి మధ్య విభేదాలు వచ్చాయని, అసలు మాట్లాడుకోవడం లేదంటూ రకరకాల రూమర్లు ప్రచారంలో ఉన్నాయి. ఈ క్రమంలోనే తాజాగా వీరిద్దరూ ముంబై ఎయిర్‌పోర్ట్‌లో కలిసి నవ్వుతూ మాట్లాడుకుంటున్న ఒక వీడియో సోషల్ మీడియాలో విపరీతంగా వైరల్ అయింది. దీంతో అన్నదమ్ములిద్దరూ తమ విభేదాలను మరచి మళ్లీ కలిసిపోయని ఫ్యాన్స్ భావించారు.వైరల్ వీడియో వెనుకున్న అసలు నిజం ఇదేఅయితే ఈ వైరల్ వీడియో వెనుకున్న అసలు నిజం వేరే ఉంది. నెట్టింట చక్కర్లు కొడుతున్న ఆ క్లిప్ ఇటీవల తీసింది కాదని, అది చాలా పాత వీడియో అని తేలింది. ఎవరో అభిమాని పాత వీడియోను సోషల్ మీడియాలో షేర్ చేయడంతో అది కాస్తా ఇటీవల జరిగిందేమోనని నెటిజన్లు భ్రమపడ్డారు. కాబట్టి హార్దిక్, కృణాల్ మళ్లీ కలిసిపోయారని చెప్పడానికి ఈ వీడియో ఎలాంటి ఆధారం కాదు. వీరిద్దరి ప్రస్తుత సంబంధాల గురించి స్పష్టమైన సమాచారం ఏదీ అందుబాటులో లేదు.అసలు హార్దిక్ -- కృణాల్ మధ్య ఏం జరిగింది?కొద్ది నెలల క్రితం భారత జట్టు టి20 ప్రపంచకప్ గెలిచిన సమయంలో కృణాల్ పాండ్యా తన సోదరుడైన హార్దిక్‌కు కనీసం శుభాకాంక్షలు కూడా చెప్పకపోవడంతో వీరి మధ్య విభేదాలు ఉన్నాయనే వార్తలు బలంగా వినిపించడం మొదలైంది. హార్దిక్ పాండ్యా, నటాషా స్టాన్‌కోవిచ్ విడాకుల విషయంలో కుటుంబంలో వచ్చిన విభేదాలే దీనికి కారణమని కొన్ని కథనాలు పేర్కొన్నాయి. మరికొన్ని నివేదికల ప్రకారం.. హార్దిక్ తన వ్యక్తిగత జీవితంపై దృష్టి పెట్టడం వల్లే అందరికీ కొద్దిగా దూరంగా ఉంటున్నాడని తెలుస్తోంది.

# ఫ్లిప్‌కార్ట్‌లో షాపింగ్ చేస్తే నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్ ఉచితం!



మీరు తరచుగా ఫ్లిప్‌కార్ట్‌లో షాపింగ్ చేస్తుంటే, మీకోసం ఒక శుభవార్త ఉంది. ఆ కంపెనీ నెట్‌ఫ్లిక్స్‌తో భాగస్వామ్యం కుదుర్చుకుంది. దీని కింద ఫ్లిప్‌కార్ట్ ప్లస్ సభ్యులు ప్రతి నెలా ఒక ఉచిత నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్‌ను పొందుతారు. దీని కోసం ఒక క్యాలెండర్ నెలలో రూ.299 లేదా అంతకంటే ఎక్కువ విలువ గల నాలుగు అర్హత గల ఆర్డర్‌లను పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ ఆఫర్ ఆగస్టు 1 నుండి ప్రారంభమవుతుంది. షాపింగ్‌తో పాటు వినియోగదారులకు అదనపు రివార్డులను అందించడమే దీని ఉద్దేశ్యం. ఈ ఆఫర్ కింద, వినియోగదారులు ఫ్లిప్‌కార్ట్, ఫ్లిప్‌కార్ట్ గ్రోసరీ, ఫ్లిప్‌కార్ట్ మినిట్స్‌లో షాపింగ్ చేయడం ద్వారా తమ అర్హత గల ఆర్డర్‌లను పూర్తి చేయవచ్చు. వినియోగదారుడు రూ.299 లేదా అంతకంటే ఎక్కువ విలువ గల నాలుగవ అర్హత గల ఆర్డర్‌ను పూర్తి చేసిన వెంటనే, వారు ఎటువంటి అదనపు చెల్లింపు లేకుండా ఫ్లిప్‌కార్ట్ యాప్ ద్వారా 30 రోజుల పాటు నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్‌ను పొందుతారు.
అంటే, నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్‌ను అన్‌లాక్ చేయడానికి ఒక సభ్యుడు నెలకు కనీసం రూ. 1,196 కొనుగోలు చేయాల్సి ఉంటుంది. అయితే ప్రతి ఆర్డర్ విలువ కనీసం రూ. 299 ఉండాలనేది షరతు. ఇది నెట్‌ఫ్లిక్స్ సబ్‌స్క్రిప్షన్‌ను విడిగా కొనుగోలు చేయడం కాదు, నిర్దేశించిన కొనుగోలు లక్ష్యాన్ని చేరుకున్న తర్వాత మాత్రమే ఈ ప్రయోజనం లభిస్తుంది.ప్రతి నెలా లక్ష్యాన్ని పూర్తి చేయాల్సి ఉంటుంది. ఈ సౌకర్యం కేవలం ఒక్కసారి మాత్రమే అందుబాటులో ఉండదు. వినియోగదారుడు వచ్చే నెలలో ఉచిత నెట్‌ఫ్లిక్స్ మొబైల్ ప్లాన్‌ను పొందాలనుకుంటే, వారు అదే నెలలో మళ్లీ రూ. 299 లేదా అంతకంటే ఎక్కువ విలువ గల నాలుగు అర్హత గల ఆర్డర్‌లను పూర్తి చేయాల్సి ఉంటుంది. అంటే ఈ రివార్డును ప్రతి నెలా మళ్లీ సంపాదించుకోవాల్సి ఉంటుంది.



కొన్ని సినిమాలతోనే చాలా మంది హీరోయిన్ ఇండియా వైడ్ గా క్రేజ్ తెచ్చుకుంటున్నారు. ఒకే ఒక్క సినిమాతో పాన్ ఇండియా స్టార్స్ గా మారిన హీరోయిన్స్ ఎంతో మంది ఉన్నారు. ఈ వయ్యారి భామ కూడా అదే కోవకు చెందింది. ఆమె మరెవరో కాదు బాలీవుడ్ హాట్ బ్యూటీ సోనాల్ చౌహాన్. చేసింది తక్కువ సినిమాలే అయినా సోషల్ మీడియాలో, సినీ వర్గాల్లో ఈమెకు విపరీతమైన క్రేజ్ ఉంది. ఈ అమ్మడు ఆశించిన స్థాయిలో ఆఫర్స్ అందుకోలేకపోతుంది. అయితే, ఈమె కెరీర్‌లో ఒకే ఒక సినిమా ఏకంగా 30 ముద్దు సీన్ల కారణంగా అప్పట్లో సంచలనంగా మారింది. 1987 మే 16న నోయిడాలో జన్మించిన సోనాల్ చౌహాన్, ఢిల్లీలోని గార్గి కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. 2005లో 'మిస్ వరల్డ్ టూరిజం' టైటిల్‌ను గెలుచుకున్న తొలి ఇండియన్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఆ తర్వాత హిమేష్ రేష్మియా పాపులర్ మ్యూజిక్ ఆల్బమ్ 'ఆప్కా సురూర్'లోని 'సంఝో నా' సాంగ్‌తో పాపులర్ అయ్యింది. అయితే, ఈమె కెరీర్‌లో ఒకే ఒక సినిమా ఏకంగా 30 ముద్దు సీన్ల కారణంగా అప్పట్లో సంచలనంగా మారింది. 1987 మే 16న నోయిడాలో జన్మించిన సోనాల్ చౌహాన్, ఢిల్లీలోని గార్గి కాలేజీలో గ్రాడ్యుయేషన్ పూర్తి చేసింది. 2005లో 'మిస్ వరల్డ్ టూరిజం' టైటిల్‌ను గెలుచుకున్న తొలి ఇండియన్‌గా ఆమె రికార్డు సృష్టించింది. ఆ తర్వాత హిమేష్ రేష్మియా పాపులర్ మ్యూజిక్ ఆల్బమ్ ' ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది. ఈ క్రేజ్‌తో 2008లో ఇమ్రాన్ హష్మీ సరసన జన్నత్ సినిమాతో బాలీవుడ్‌లోకి గ్రాండ్‌గా ఎంట్రీ ఇచ్చింది. ఈ సినిమా సూపర్ హిట్ అవ్వడమే కాకుండా, సోనాల్‌ను ఓవర్ నైట్ స్టార్ డమ్ తో పాటు కుర్రాళ్ల డ్రీమ్ గర్ల్ గా మారిపోయింది. అయితే ఆతర్వాత అవకాశాలు అందుకోవడం లోనే సోనాల్ వెనకబడింది. ఈ క్రమంలోనే 2013లో ఆమె నీల్ నితిన్ ముఖేష్‌తో కలిసి '3+ -- ఎ కిల్లర్ కనెక్షన్' అనే హర్రర్ థ్రిల్లర్ చిత్రంలో నటించింది. ఈ సినిమా డిజాస్టర్ అయ్యింది.

## ఒకే ఒక్క సినిమా.. 30 లిప్ లాక్స్.

సోనాల్ చౌహాన్



## నా పర్సనల్ లైఫ్ గురించి మీకేం తెలుసు..?

దక్షిణాది సినీప్రియులకు అత్యంత ఇష్టమైన హీరోయిన్లలో అనుపమ పరమేశ్వరన్ ఒకరు. తెలుగు, తమిళం, మలయాళం భాషలలో అనేక హిట్ చిత్రాల్లో నటించి మెప్పించింది. చాలా కాలంగా సైలెంట్ అయిన ఈ కేరళ కుట్టి.. ఇప్పుడిప్పుడే తిరిగి సినిమాల్లో, అటు సోషల్ మీడియాలో యాక్టివ్ అయ్యింది. తాజాగా తన కొత్త సినిమా ప్రెస్ మీట్ లో పాల్గొంది.

అనుపమ పరమేశ్వరన్.. తెలుగులో వన్ ఆఫ్ ది టాప్ హీరోయిన్. కొన్నాళ్ళుగా సైలెంట్ అయిన ఈ అమ్మడు.. ఇప్పుడు తిరిగి అటు సోషల్ మీడియా, ఇటు సినిమాల్లో యాక్టివ్ అయ్యింది. తాజాగా ఆమె నటిస్తూన్న లేటేస్ట్ మూవీ క్రేజీ కళ్యాణం. ఇందులో తరుణ్ భాస్కర్, అఖిల్ రాజ్, వీగే నరేశ్, కిరిటీ కీలకపాత్రలు పోషిస్తున్నారు. యారో సినిమాస్ బ్యానర్ పై బూసం జగన్మోహన్ రెడ్డి నిర్మిస్తున్న ఈ చిత్రానికి భద్రప్ప గాజుల దర్శకత్వం వహిస్తున్నారు. ఈ సినిమాను త్వరలోనే అడియన్స్ ముందుకు తీసుకురాబోతున్నారు. ఈ క్రమంలోనే ఆగస్ట్ 1న హైదరాబాద్ లో ఈ మూవీ టీజర్ లాంచ్ ఈవెంట్ జరగ్గా.. డైరెక్టర్ నందినీ రెడ్డి ముఖ్య అతిథిగా విచ్చేసింది. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన ప్రెస్ మీట్ లో అనుపమకు వరుస ప్రశ్నలు ఎదురయ్యాయి. ముఖ్యంగా ఇటీవల ఆమె చేసిన ఇన్ స్టా పోస్ట్ పై ప్రశ్నించగా తనదైన స్టైల్లో రియాక్ట్ అయ్యింది. మీడియా ఇంటరాక్షన్ సందర్భంగా, రిపోర్టర్ అనుపమను ఆమె గతంలో ప్రైవేట్‌గా ఉండేవారని, అయితే గడిచిన కొన్ని రోజులుగా సోషల్ మీడియా ద్వారా విషయాలను బయటపెట్టడం అవసరమా అని ప్రశ్నించారు. ముఖ్యంగా ఆమె అభిమానులతో రీల్స్ ద్వారా కనెక్ట్ అయ్యేవారని, కానీ ఇప్పుడు పరిస్థితి భిన్నంగా ఉందని రిపోర్టర్ పేర్కొన్నారు. ఇందుకు అనుపమ స్పందిస్తూ.. "అది నా సోషల్ మీడియా. నేను ఏమి పోస్ట్ చేయాలో నేను నిర్ణయించుకుంటాను," అని అన్నారు. తాను దేనినీ బయటపెట్టలేదని, కేవలం ఒక మహిళ పరివర్తన గురించి మాట్లాడుతున్నానని, అలా చేసినందుకు గర్వపడుతున్నానని ఆమె తెలిపారు. రిపోర్టర్ అది అవతలి వారిని నిందించడం కాదా అని అడగగా, అనుపమ, "నా గురించి మీకు ఏమి తెలుసా? నా జీవితం గురించి మీకు ఏమి తెలుసు?" అని ఎదురు ప్రశ్నించారు. ఎవరికీ తెలియదని రిపోర్టర్ ఒప్పుకోవడంతో, అనుపమ "సో, సో పర్వాలేదు. అది మా ఇన్‌స్టాగ్రామ్. మాకు నచ్చినది మేము పోస్ట్ చేస్తాము. అంతే," అని ముగించారు. ప్రస్తుతం అనుపమ చేసిన కామెంట్స్ నెట్టింట వైరలవుతున్నాయి.





## మొన్న కామాఖ్య.. నేడు చైనా పీస్.

నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్ హీరోలుగా అక్కి విశ్వనాధ రెడ్డి దర్శకత్వంలో రూపొందుతున్న యూనిక్ స్పై డ్రామా 'చైనా పీస్'. మూన్ లైట్ డ్రీమ్స్ బ్యానర్‌పై తెరకెక్కిన ఈ చిత్రంలో కమల్ కామరాజు, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ కీలక పాత్రలు పోషించారు. ఇప్పటికే ఈ సినిమా ప్రమోషనల్ కంటెంట్ మంచి బజ్‌ను క్రియేట్ చేసింది. యూనిక్ కాన్సెప్ట్, ఆకట్టుకునే ప్రెజెంటేషన్, యాక్షన్, థ్రిల్, హ్యూమర్ ఎలిమెంట్స్‌తో విడుదలైన టీజర్ సినిమాపై అంచనాలను మరింత పెంచింది. ఇంతకుముందు 'చైనా పీస్' పేరుతో ప్రేక్షకులకు పరిచయమైన ఈ చిత్రం, ఇప్పుడు 'సీక్రెట్ సోల్జర్' పేరుతో ప్రేక్షకుల ముందుకు రానుంది. తాజాగా ఈ చిత్రానికి సెంట్రల్ బోర్డ్ ఆఫ్ ఫిల్మ్ సర్టిఫికేషన్ (సీబీఎఫ్‌సీ) యూ/ఏ 16o సర్టిఫికెట్ జారీ చేసింది.

అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ చిత్రాన్ని 2026 సెప్టెంబర్‌లో థియేటర్లలో విడుదల చేయడానికి నిర్మాతలు సన్నాహాలు చేస్తున్నారు. ఈ చిత్రానికి సురేష్ రగుతు సినిమాటోగ్రాఫర్‌గా వ్యవహరించగా, మార్తాండ్ కె. వెంకటేష్ ఎడిటర్‌గా పనిచేశారు. నిహాల్ కోదాటి, సూర్య శ్రీనివాస్, హర్షిత బండ్కమూరి, కమల్ కామరాజు, తులసి, రఘు బాబు, రంగస్థలం మహేష్, శ్రీనివాస్ వడ్లమాని, శ్రీకాంత్ అయ్యంగార్ తదితరులు ఈ సినిమాలో ప్రధాన పాత్రలు పోషిస్తున్నారుటెక్నికల్ టీం:రచన, దర్శకత్వం: అక్కి విశ్వనాధ రెడ్డిబ్యానర్: మూన్ లైట్ డ్రీమ్స్‌డైరెక్టర్ ఆఫ్ ఫోటోగ్రఫీ: సురేష్ రగుతుసంగీతం: కార్తీక్ రోడ్రిగ్జ్ఎడిటర్: మార్తాండ్ కె. వెంకటేష్‌పీఆర్వో: తేజస్వీ సజ్జా

## ఎల్లమ్మా తల్లీ.. దీవించమ్మా! బోనమెత్తిన టాలీవుడ్ హీరోయిన్..



తెలంగాణ సంస్కృతి, సంప్రదాయాలకు ప్రతీకగా నిలిచే ఆషాఢ బోనాల మహోత్సవాలు అట్టహాసంగా జరుగుతున్నాయి. తరాజుల విన్యాసాలు, డప్పు వాయిద్యాల మధ్య భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తూ మొక్కులు తీర్చుకుంటున్నారు. హైదరాబాద్ నగర వ్యాప్తంగా బోనాల సంబరాలు అంబరాన్నంటున్నాయి. సామాన్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ వేడుకల్లో భాగమవుతున్నారు. ఈ క్రమంలోనే ప్రముఖ హీరోయిన్ వాసవి గణేశన్ బోనాల ఉత్సవాల్లో పాల్గొంది. హైదరాబాద్ నగర వ్యాప్తంగా బోనాల సంబరాలు అంబరాన్నంటున్నాయి. సామాన్యులతో పాటు పలువురు సినీ ప్రముఖులు కూడా ఈ వేడుకల్లో భాగమవుతున్నారు. ఈ క్రమంలోనే ప్రముఖ హీరోయిన్ వాసవి గణేశన్ బోనాల ఉత్సవాల్లో పాల్గొంది. హుషారు పిట్టలతో హీరోయిన్ గా పరిచయం కానున్న వాసవీ గణేశన్ తాజాగా బోనమెత్తింది. అనంతరం ఈ వేడుకకు సంబంధించిన పొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీటికి 'ఎల్లమ్మా తల్లీ బ్లెస్సింగ్స్' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. హుషారు పిట్టలతో హీరోయిన్ గా పరిచయం కానున్న వాసవీ గణేశన్ తాజాగా బోనమెత్తింది. అనంతరం ఈ వేడుకకు సంబంధించిన పొటోలను సోషల్ మీడియాలో షేర్ చేసింది. వీటికి 'ఎల్లమ్మా తల్లీ బ్లెస్సింగ్స్' అంటూ క్యాప్షన్ ఇచ్చింది. ప్రస్తుతం ఈ ఫొటోలు సామాజిక మాధ్యమాల్లో వైరల్ గా మారాయి. ఈ ఫొటోల్లో చీరకట్టులో చాలా సంప్రదాయబద్ధంగా దర్శనమిచ్చింది వాసవి గణేశన్. ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ బోనాల ఫొటోలు నెటిజన్లను బాగా ఆకట్టుకుంటున్నాయి. కాగా వాసవి హీరోయిన్ గా నటిస్తోన్న హుషారు పిట్టలు సినిమా స్వాతంత్ర దినోత్సవం కానుకగా ఆగస్టు 15న విడుదల కానుంది.

ఈ ఫొటోల్లో చీరకట్టులో చాలా సంప్రదాయబద్ధంగా దర్శనమిచ్చింది వాసవి గణేశన్. ప్రస్తుతం ఈ యంగ్ హీరోయిన్ బోనాల ఫొటోలు నెటిజన్లను బాగా ఆకట్టుకుంటున్నాయి. కాగా వాసవి హీరోయిన్ గా నటిస్తోన్న హుషారు పిట్టలు సినిమా స్వాతంత్ర దినోత్సవం కానుకగా ఆగస్టు 15న విడుదల కానుంది.

## తెలుగులో ఆ హీరో ఫుల్ హార్డ్ వర్కర్.. కామెడీ టైమింగ్ మాత్రం వేరే లెవల్.



సౌత్ ఇండస్ట్రీలో నటుడిగా, దర్శకుడిగా, కొరియోగ్రాఫర్ గా తనదైన ముద్రవేశారు ప్రభుదేవ. ఎన్నో సూపర్ హిట్ చిత్రాల్లో కీలకపాత్రలు పోషించారు. అలాగే అద్భుతమైన పాటలకు కొరియోగ్రఫీ అందించారు. అంతేకాకుండా సూపర్ హిట్ చిత్రాలను తెరకెక్కించి దర్శకుడిగానూ సక్సెస్ అయ్యారు. గతంలో ఓ ఇంటర్వ్యూలో పాల్గొన్న ఆయన తనకు తెలుగులో ఇష్టమైన హీరో గురించి.. అలాగే ఆయన యాక్టింగ్, హార్డ్ వర్కింగ్, కామెడీ టైమింగ్ గురించి ఆసక్తికర కామెంట్స్ చేశారు. టాలీవుడ్ ఇండస్ట్రీలో తనకు మెగాస్టార్ చిరంజీవి అంటే చాలా ఇష్టమని.. ఆయన కింగ్ ఆఫ్ హార్డ్ వర్కింగ్ అని అన్నారు. ఆ రోజుల్లో చిరంజీవి డ్యాన్సర్లలో అగ్రస్థానంలో ఉన్నారని.. ఆయన అలుపెరుగని కృష్టిని మరోసారి గుర్తు చేసుకున్నారు. ప్రభుదేవా మాట్లాడుతూ, "చిరంజీవి సార్ నిజంగానే కింగ్ ఆఫ్ హార్డ్ వర్కింగ్. ఆయనకు అలుపే లేదు," అని ప్రభుదేవా అన్నారు. తనతో ఉన్న జ్ఞాపకాలను పంచుకుంటూ, "సాయంత్రం రిహార్సల్స్‌కి పిలిచి ఆయన డ్యాన్స్ చేస్తూ ఉండేవారు. నేను అలా కూర్చుని చూసేవాడిని. ఆయన ఇంట్లో దోశలు భయంకర ఫేమస్. ఆ దోశలు నన్ను తినపెట్టి, ఆయన మళ్ళీ డ్యాన్స్ ప్రాక్టీస్ చేస్తూ ఉండేవారు. చిరంజీవి సార్ అంతటి అంకితభావంతో పనిచేసేవారు" అని వివరించారు. చిరంజీవికి స్టార్‌డమ్ రావడానికి, ప్రజల్లో విశేష ఆదరణ పొందడానికి ఆయన పాటలు, ముఖ్యంగా వినూత్నమైన డ్యాన్స్ స్టెప్పులు ప్రధాన కారణం" అని అన్నారు. చరంజీవి డ్యాన్స్‌లోనే కాకుండా, నటనలోనూ తనదైన ముద్ర వేశారని ప్రభుదేవా స్పష్టం చేశారు. "చిరంజీవి సార్ కామెడీ అంటే నాకు చాలా ఇష్టం. ఆయన ఒక కంప్లీట్ ప్యాకేజ్ సార్. ఆయన నటన అద్భుతం. భావోద్వేగాలను పండించడంలో ఆయనకు సాటి లేరు. స్టైల్, డ్యాన్స్ -- ఇలా అన్ని విభాగాల్లోనూ చిరంజీవి సంపూర్ణ కళాకారుడు" అని ప్రభుదేవా చెప్పుకొచ్చారు.

## ఇప్పుడు ఉన్న హీరోలలో అతడు చాలా స్పెషల్.



తెలుగు చిత్రసీమలో నాలుగు దశాబ్దాలుగా హీరోగా, సహాయ నటుడిగా రాణిస్తున్నారు శ్రీకాంత్. ఇప్పటికీ వరుస సినిమాలతో ప్రేక్షకులను అలరిస్తున్నారు. అయితే ఓ ఇంటర్వ్యూలో శ్రీకాంత్ మాట్లాడుతూ.. తన ప్రస్తుత కెరీర్ దశను ఒక "బోనస్" గా తెలిపారు. "సెకండ్ ఇన్నింగ్స్" లో తాను టెన్షన్లు లేకుండా పనిచేయడాన్ని ఆస్వాదిస్తున్నానని, డబ్బు కంటే ఇదే ముఖ్యమని ఆయన అన్నారు. ఇదివరకు హీరోగా ఉన్నదానికంటే ఇప్పుడు మరింత సంతృప్తిగా ఉన్నానని వెల్లడించారు. తన కుమారుడు రోషన్ కెరీర్ ను పర్యవేక్షిస్తూనే, తాను కూడా విభిన్నమైన కథాంశాలతో హీరోగా సినిమాలు చేయాలనే ఉద్దేశం ఉందని చెప్పారు. ఓటీటీ ప్లాట్‌ఫామ్ చరణ్ లోనూ ఉన్నాయని అన్నారు. చరణ్ చాలా మెచ్యూర్డ్, ఇంటెలిజెంట్ వ్యక్తి అని, డిగ్నిఫైడ్ గా ఉంటాడని ప్రశంసించారు. ఆర్ఆర్ఆర్ వంటి భారీ విజయం సాధించి, అంతర్జాతీయ స్టార్ గా ఎదిగినా కూడా చరణ్ లో ఎలాంటి గర్వం లేదని, సెట్ లో చాలా సింపుల్ గా ఉంటాడని శ్రీకాంత్ వివరించారు. చిరంజీవి మాదిరిగానే చరణ్ కూడా అందరినీ దగ్గరకు తీసుకుని మాట్లాడుతూ, అన్నయ్య అని పిలుస్తూ ఎంతో గౌరవం ఇస్తాడని తెలిపారు. చరణ్ లోని డీసెంట్ స్వభావం, హుందాతనం తనకు బాగా నచ్చుతాయని చెప్పారు. వయసులో చిన్నవాడైనప్పటికీ, చాలా పరిణతి చెందిన వ్యక్తి అని అన్నారు.